


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 31 | శనివారం 31 - 01 -2026 | పేజీలు : 12 | వెల-3


## లడ్డూ వివాదంపై చంద్రబాబు క్లారిటీ ఇవ్వాలి

**తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు లేదని ల్యాబ్ నివేదికలు తేల్చాయన్న సజ్జల**



2లో

తిరుపతి లడ్డూలో జంతు కొవ్వు కలిపారంటూ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టత ఇవ్వాలని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త



## ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

**వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ**

**అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత**

2లో

నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్



# 4 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి

**80శాతం స్థానికులకే ఉద్యోగాలు**

**జేఎన్‌టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి**

2లో

4 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని.. అందులో 80 శాతం స్థానికులకే ఇస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి, మందులు అందుబాటులో తెచ్చామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కారం చేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి



2లో

## రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి,ప్రధాని

## మహాత్ముడికి నివాళి అర్పించిన చంద్రబాబు

మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది.

## ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

**క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్**

**బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి**

2లో

తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి



# ప్రశంసలు కాదు.. పనిపై శ్రద్ధ పెట్టండి

2లో

**ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాల్సిందే**

**ఉత్తరాంధ్ర పంచాయితీ అధికారులతో డిప్యూటీ సిఎం పవన్**



తనకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదని, క్షేత్రస్థాయిలో నిజమైన పని మాత్రమే కావాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు పూర్తి నిబద్ధతతో పని చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.. ఉత్తరాంధ్ర పంచాయతీరాజ్ అధికారుల సమావేశంలో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఘాటు వ్యాఖ్యలు చేశారు. అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ వంటి కీలక పథకాల అమలులో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోలేకపోయినా, పనిలో అలసత్వం చూపించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సోషల్ ఆడిట్ ప్రక్రియను కూడా మొక్కుబడిగా కాకుండా పక్కాగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరికీ చేరాల్సిందేనని, అలా జరగకపోతే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.. ఇక, తన వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు, సిఫార్సులు ఉండవని పవన్ కల్యాణ్ స్పష్టంగా చెప్పారు. ప్రతి అధికారి నిబంధనల ప్రకారమే పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన కొంతమంది అధికారులు ఇప్పటికీ పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వ్యవహారాలను ఇకపై సహించబోమని హెచ్చరించారు. ఎలాంటి రాజకీయ ప్రలోభాలకు తావులేకుండా నిబంధనల మేరకు మాత్రమే నిర్ణయాలు

## ఇన్నాళ్లూ తిరుమల లడ్డూపై

# దుమ్మెత్తి పోసారు

**ఇప్పుడేమో జంతువుల కొవ్వు లేదన్నాక మౌనమా**

**చంద్రబాబు. పవన్‌ల తీరుపై మండిపడ్డ అంబటి**

2లో



## భవిష్యత్ భారత్‌పై అవగాహన పెంచుకోవాలి

**ప్రపంచంలో వస్తున్న మార్పులను స్టడీ చేయాలి**

**విద్యార్థులతో భేటీలో సిఎం చంద్రబాబు**

**టీచర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం**

2లో





2లో

## మాజీ మంత్రి విడదల రజనీకి నిరసన సెగ

# జనసంద్రమైన మేడారం

## భారీగా తరలివచ్చిన భక్తులు

## క్యూలైన్లలో గంటలతరబడి నిరీక్షణ

మేడారం మహా జాతరలో సమ్మక్క, సారలమ్మలు గద్దెలనెక్కారు. ఈ నేపథ్యంలో ఆ వన దేవతలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. దీంతో భక్తులను కంట్రోలు చేయడం ఒకానొక దశలో తీవ్రంగా పరిణమించింది. ఇప్పటికే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ జాతరకు హాజరై.. వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈనె 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ఇంకో వైపు జాతరలో జరుగుతున్న పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. అదే సమయంలో మంత్రి అడ్లూరి లక్షణ్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. ఆయన కారు అద్దాలతో పాటు స్థానిక షాపులను భక్తులు ధ్వంసం చేశారు. అలాగే భక్తుల రద్దీని నియంత్రించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని.. వారంతా వీవీఐపీలు, పోలీస్ కుటుంబాల సేవల్లో



2లో

# భవిష్యత్ భారత్‌పై అవగాహన పెంచుకోవాలి

భవిష్యత్ భారతదేశం ఎలా ఉండబోతోందనే అంశంపై విద్యార్థులు కూడా అవగాహన పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిణామాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలి. అలా అందిపుచ్చుకోవడం వల్లే ఐటీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వాళ్లు విస్తరించారని అన్నారు. చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలంలో అగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీచర్ల ట్రైనింగ్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. రూ.3 కోట్ల వ్యయంతో 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏడాదికి 5 వేల మంది టీచర్లు, స్కూల్ లీడర్లను తీర్చిదిద్దేలా శిక్షణ ఇవ్వనున్నట్టు ఆగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం అకాడమీ ప్రాగంణంలోనే లెర్నర్స్ అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆగస్త్య అకాడమీ ఆడిటోరియంలో విద్యార్థులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశాను.. ఇప్పుడు ఏఐ గురించి అందరూ ఆలోచన చేయాలని చెబుతున్నా. విద్యార్థులు ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి.. భవిష్యత్ మనదే. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు వస్తాయని అన్నారు. . కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్ కంపెనీలకు అవకాశాలు దక్కేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. డ్రోన్, స్పేస్ సిటీ వంటి వాటితో ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను గమనించాలని వారికి సూచించారు. విద్యుత్ రంగంలో మార్పులు వస్తున్నాయి.. అందుకే విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించగలిగాం. టెక్నాలజీ అందిపుచ్చుకుంటే విద్యుత్ ఛార్జీలను తగ్గించవచ్చు. కుప్పంను ప్రయోగశాలగా చూస్తా.. ఇక్కడికి అన్ని రకాల టెక్నాలజీలు తెస్తున్నాం. హంద్రీ-నీవా ద్వారా కుప్పం వరకు నీళ్లు తెచ్చాం.. నీటి భద్రత కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటి సంరక్షణ విషయంలో ఆగస్త్య అకాడమీ ప్రతినిధులు వినూత్నంగా ఆలోచన చేయాలి. నీటి సంరక్షణ, నీటి సద్వినియోగం విషయంలో కుప్పంలో పైలెట్ ప్రాజెక్టు చేపడదాం అని చంద్రబాబు తెలిపారు.

# ఇన్నాళ్లూ తిరుమల లడ్డూపై దుమ్మెత్తి పోసారు

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్ నివేదిక వెలువడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మౌనం పాటించడంపై వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. సిట్ రిపోర్టు వచ్చాక ఇంతవరకు పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంపై విషం చిమ్మిన నీచులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అంటూ అంబటి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు పూర్తిగా చెంచాగా మారిపోయారని, సొంత పార్టీ నడుపుతున్నానన్న సంగతే మర్చిపోయారని ఎద్దేవా చేశారు. వెంకటేశ్వర స్వామి ప్రతిష్టకు భంగం కలిగేలా వీరిద్దరూ వ్యవహరించారని ఆరోపించారు. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ అనుచిత వ్యాఖ్యలు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూలో కూడా జంతువుల కొవ్వు ఉందంటూ పవన్ కళ్యాణ్ తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇలాంటి విష ప్రచారం చేయడం ధర్మమా అని ప్రశ్నించారు అంబటి.. అసలు శాంపిల్స్ తీసిన ట్యాంకర్లు కూటమి ప్రభుత్వ హయాంలోనే వచ్చాయని, చంద్రబాబు సీఎం అయిన నెల రోజుల తర్వాత వచ్చిన ట్యాంకర్లలోనే శాంపిల్స్ తీసినట్లు ల్యాబ్ రిపోర్టులు స్పష్టంగా చెబుతున్నాయని అంబటి తెలిపారు. వాటిల్లో జంతువుల కొవ్వు కలవలేదని నివేదికలు తేల్చినా, వైసీపీపై నిందలు వేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవాలేంటో సీబీఐ తేల్చిందని, అయినప్పటికీ తప్పుడు ప్రచారాలు ఆపడం లేదని మండిపడ్డారు. హర్ష్ డెయిరీ పేరుతో బోలేబాబా ఎంటరైనది కూడా చంద్రబాబు హయాంలోనేనని గుర్తు చేశారు. వైవీ సుబ్బారెడ్డి తప్పు చేసి ఉంటే ఆయన పేరు ఛార్జిషీట్‌లో ఎందుకు లేదని ప్రశ్నించారు అంబటి.. చంద్రబాబుకు ఇప్పటికీ బుద్ధి రాలేదని, లడ్డూకి పంగనామాలు పెట్టి మార్ఫింగ్ ఫోటోలు సృష్టించారని ఆరోపించారు. టీటీడీ ఛైర్మన్ కొండ మీద కూర్చుని పచ్చి అబద్దాలు ఆడుతున్నారని, కొందరు అధికారులు కూడా దైవం దగ్గర అపచారానికి పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. శ్యామలరావు, వెంకన్న చౌదరి లాంటి వారికి తగిన గుణపాఠం చెప్పే సమయం దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు. చంద్రబాబు మోజేతి నీళ్లు తాగుతూ ఇష్టానుసారం వ్యవహరించే వారిని వదిలిపెట్టేదే లేదని అన్నారు. లడ్డూ వ్యవహారంలో ప్రజలకు వాస్తవాలు తెలిసిపోయాయని, సిట్ రిపోర్టు వచ్చిన తర్వాత చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వాళ్ల నోర్లు ఎందుకు మూత పడ్డాయో చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ నిజమైన రాజకీయ నాయకుడిగా మారితేనే మంచిదని హితవు పలికారు మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు..

# జనసంద్రమైన మేడారం

అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ౯÷ళిడారం ఉత్సవాల్లో భాగంగా బుధవారం.. సారలమ్మ, గురువారం.. సమ్మక్కలు గ్దదెపైకి చేరుకున్నారు. దీంతో మేడారం జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతమై నట్లయింది. గురువారం అర్ధరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువెల్ ఓరమ్ మేడారం విచ్చేసి.. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు వీఐపీలు, వీవీఐపీలు భారీగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సారథ్యంలో 25 మంది ఐపీఎస్‌లు అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలివస్తున్నారు.

# శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కలిసింది నిజం

### గత ఛైర్మన్ హస్తం లేకుండా కల్తీ జరిగేదా
### ఆయన పిఎ ఖతాల్లోకి కోట్లు ఎలా వచ్చాయి
### టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు విమర్శలు
### గజనీ, గోరీ మహ్మద్‌లాగా వ్యవహరించిన జగన్: భాను

గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డూల తయారీలో ప్రాణాలు తీసే రసాయనాలు వాడారని, కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. నెయ్యిలో నూటికి నూరు శాతం కల్తీ జరిగిందన్నారు. నివేదికలో జంతువుల కొవ్వులు లేవని ఎక్కడా నిర్ధరణ కాలేదని చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కమిషన్ల కోసం కక్కుర్తిపడి భోలే బాబా డెయిరీకి టెండర్లు ఇచ్చారని, గత తితిదే ఛైర్మన్, ముఠా మేస్త్రి సహకారం లేకుండా ఇవన్నీ చేయగలరా? అని ప్రశ్నించారు. సుబ్బారెడ్డి పీఏ చిన్నప్ప ఖాతాలోకి రూ.కోట్లు వచ్చాయి. ఆ ఖాతా నుంచి ఎక్కడికి వెళ్లాయో సీబీఐ వెల్లడించాల్సి ఉందన్నారు. ఈ అక్రమాల వెనుక ఉన్నవారి పేర్లు బయటపెట్టాలని సీబీఐని కోరుతున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రాకుంటే ఆ కల్తీ నెయ్యి ఇంకా కొనసాగేది. దుర్మార్గుల నుంచి తితిదేని మనమంతా కాపాడుకోవాలని బీఆర్ నాయుడు అన్నారు. ఇదిలావుంటే వైకాపా తీరుపై తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మండిపడ్డారు. గజినీ మహమ్మద్, గోరీ మహమ్మద్ వ్యవహరించినట్లుగా వైకాపా పాలన సాగిందని వ్యాఖ్యానించారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. నెయ్యి లేకుండా రసాయనాలు వాడి తిరుమల లడ్డూను కల్తీ చేశారని మండిపడ్డారు. సిట్ ఇచ్చిన నివేదికలో వైకాపా నేతలకు ఎక్కడైనా క్లీన్‌చిట్ కనిపించిందా? ఏ ముఖం పెట్టుకొని సంబరాలు చేసుకుంటున్నారు? యాగాలు చేసినా, గంగానదిలో మునిగినా స్వామి క్షమించరు. ప్రజల ఆగ్రహంతో 11 స్థానాలకే పడిపోయినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదు. శ్రీవారి ఆగ్రహం వైకాపాపై.. అనుగ్రహం ఎన్డీయేపై ఉంటుందని భానుప్రకాశ్ అన్నారు.

# మాజీ మంత్రి విడదల రజనీకి నిరసన సెగ

పల్నాడు జిల్లాలోని యడ్లపాడు మండలం బోయపాలెం వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజనీ (ఎఅఎబఖుశ్రీఖ ఝుయిఖఅఅ) శుక్రవారం సందర్శించారు. వేంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం ఆమెకు భక్తులు, గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'లడ్డూ కల్తీ' వ్యవహారమే ఈ నిరసనలకు ప్రధాన కారణమైంది. విడదల రజనీ తన అనుచరులతో కలిసి బోయపాలెం వెంకన్నను దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విడదల రజనీ ఆలయం నుంచి బయటకు రాగానే అప్పటికే అక్కడ వేచి ఉన్న గ్రామస్తులు, భక్తులు ఒక్కసారిగా నిరసనకు దిగారు. 'గో బ్యాక్ రజనీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**భక్తుల వాదన..** పవిత్రమైన తిరుమల లడ్డూ విషయంలో మహాపాపం చేసిన వారు, తమ గ్రామ దేవాలయానికి రావొద్దంటూ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో జరిగిన పరిణామాలపై తమ నిరసనను వ్యక్తం చేశామని పేర్కొన్నారు.

**మౌనంగా వెనుదిరిగిన విడదల రజనీ..** పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో విడదల రజనీ ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండానే నిరసనల మధ్య తన కారులో అక్కడి నుంచి సైలెంట్‌గా వెనుదిరిగారు. ఆమెతో పాటూ ఉన్న వైసీపీ నేతలు కూడా అక్కడి నుంచి నిష్క్రమించారు.

**రాజకీయ వర్గాల్లో చర్చ..** తిరుమల నెయ్యి కల్తీ అంశం కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి కూడా ఎంత బలంగా వెళ్లిందో ఈ ఘటన నిరూపిస్తోంది. ముఖ్యంగా పల్నాడు వంటి ప్రాంతాల్లో వైసీపీ నేతలకు ఇలాంటి నిరసనలు ఎదురుకావడం పార్టీ శ్రేణుల్లో చర్చకు దారితీస్తోంది.

# లడ్డూ వివాదంపై చంద్రబాబు క్లారిటీ ఇవ్వాలి: సజ్జల డిమాండ్

సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ హయాంలో లడ్డూలో జంతు కొవ్వు వాడారని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేదా ల్యాబ్ నివేదికల నేపథ్యంలో ఒక నిర్దిష్ట ప్రకటన చేయాలని ఆయన కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తిరుపతి లడ్డూలో ఎలాంటి జంతు కొవ్వు లేదని ల్యాబ్ నివేదికలు స్పష్టంగా తేల్చి చెప్పాయని సజ్జల అన్నారు. ఈ అంశంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని, దీనిని తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, ఇంత బాధ్యతారహితమైన ప్రకటన చేసినందుకు ఆయనను నిలదీయాలని పేర్కొన్నారు. రెండు జాతీయ ప్రయోగశాలల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా సిట్ ఇచ్చిన రిపోర్ట్‌లో లడ్డూలో జంతు కొవ్వు లేదని తేలిందని, అయినా ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి చంద్రబాబు ప్రయత్నించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో అప్పటి టీటీడీ ఛైర్మన్ లేదా బోర్డు సభ్యుల ప్రమేయం ఉన్నట్లు సిట్ నివేదికలో ఎక్కడా పేర్కొనలేదని సజ్జల గుర్తుచేశారు. ఇది తమకు క్లీన్‌చిట్ లాంటిదని, ఈ ఆరోపణలు న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటాయని తెలిపారు. వాస్తవాలు అంగీకరించకుండా, చంద్రబాబు, ఆయన ప్రచార యంత్రాంగం ఇప్పటికీ తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి 2019-24 మధ్య కాలంలోనే అవకతవకలు జరిగాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు వ్యాఖ్యల వల్లే ఈ మొత్తం విచారణ మొదలైందని, భక్తుల మనోభావాలు దెబ్బతిన్నందున ఆయన దీనిపై కచ్చితంగా వివరణ ఇవ్వాలని సజ్జల అన్నారు. "నెయ్యి సేకరణకు సంబంధించి ఇప్పటికే ఒక పటిష్టమైన వ్యవస్థ ఉంది. మేము దానిని మరింత మెరుగుపరిచాం. నాణ్యతా నియంత్రణ చర్యలను కఠినతరం చేసి, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను తిరస్కరించాం. వ్యవస్థలో ఆధునికతను తీసుకొచ్చాం. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేవలం 2019-24 కాలాన్ని, కొన్ని లావాదేవీలను మాత్రమే ఎంచుకుని విమర్శించడం వారి రాజకీయ దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోంది. ఆ కంపెనీలు, కాంట్రాక్టర్లు అంతకు ముందు నుంచే ఉన్నారు. పేర్లు మారినా, సరఫరాదారులు వారే" అని సజ్జల వివరించారు.

# ఫిబ్రవరి 1న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి

తిరుమలలో ఫిబ్రవరి 1న జరగనున్న శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటికి విచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ తీర్థానికి ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే యాత్రికులను అనుమతించనున్నారు. ఉదయం 7 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడ వీధుల గుండా పూలు, పండ్లు, స్వామివారి ప్రసాదాలు తదితర పూజా సామగ్రిని శ్రీరామకృష్ణ తీర్థానికి తీసుకెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. 12 ఏళ్ల వయస్సులోపు ఉన్న చిన్న పిల్లలు, అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతి లేదు. పాపవినాశనం వద్ద భక్తులను మెడికల్ స్క్రీనింగ్ చేసిన తర్వాతే తీర్థానికి అనుమతిస్తారు. భక్తులకు అత్యవసర వైద్యం అందించేందుకు ఈ మార్గంలో రెండు అంబులెన్సులు, 4 మెడికల్ క్యాంపుల ఏర్పాటు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ఆర్టీసీ 40 బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఈ తీర్థానికి వెళ్లే యాత్రికులకు తితిదే అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో మంచినీరు, మజ్జిగ, పాలు, కాఫీ, పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం పంపిణీ చేస్తారు.

# బంగారం ధరల తిరోగమనం భారీగా తగ్గిన ధరలు

గత కొన్ని రోజుల నుంచి చుక్కలు చూపిస్తున్న బంగారం, వెండి ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. గురువారం ఆల్‌టైమ్ రికార్డ్ స్థాయికి చేరిన బంగారం, వెండి ధరలు శుక్రవారం అథ:పాతాళానికి పడిపోయాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్ మార్కెట్‌లో 1,80,779 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కిలో వెండి ధర రూ.4,20,048 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు ఊహించని విధంగా ధరలు భారీ స్థాయిలో పతనమయ్యాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంపై రూ.15,246 తగ్గింది. ప్రస్తుత ధర రూ. 1,54,157 ఉంది. వెండిపై ఏకంగా రూ. 67,891లు తగ్గింది. ప్రస్తుత ధర 3,32,002 రూపాయలుగా ఉంది. బంగారం, వెండి ధరలు ఒకే రోజు ఇంతలా పతనమవడానికి కారణం ఇన్వెస్టర్లు భారీ ప్రాఫిట్ బుకింగ్‌కు దిగటమేనని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. ఫ్యూచర్స్‌తో పోలిస్తే ఈటీఎఫ్ ధరలు మరింత పతనమయ్యాయని తెలిపారు. ఫెడ్ తదుపరి చీఫ్‌గా ఆ విభాగం మాజీ అధికారి కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తారన్న వార్తలు కూడా బంగారం, వెండి ధరలు తగ్గటానికి మరో కారణమని అనలిస్టులు అంటున్నారు.

# అమరావతిలో బిట్స్ పిలాని క్యాంపస్

రాజధాని అమరావతిలో బిట్స్ పిలానీ నిర్మాణానికి సంబంధించి ఆ సంస్థ ప్రతినిధులు సీఆర్డీఏతో ఒప్పందం చేసుకున్నారు. దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన బిట్స్.. అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీని కోసం తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెం గ్రామాల పరిధిలో 70 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు బిట్స్ సంస్థ ప్రతినిధులు సీఆర్‌డీఏతో భూ విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్‌డీఏ ఎస్టేట్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ వి.దేవిడ్ రాజు, బిట్స్ పిలానీ తరపున అధీకృత ప్రతినిధిగా డిప్యూటీ రిజిస్ట్రార్ వి.వి.ఎస్.ఎన్. మూర్తి పాల్గొన్నారు. మందడం సబ్ రిజిస్ట్రార్ సి.హెచ్. రాంబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. బిట్స్ నిర్మాణ పనులు మొదలైతే... అమరావతి ప్రాంతం ఉన్నత విద్యకు కేంద్రంగా మారే క్రమంలో ముందడుగు పడినట్లవుతుంది. బిట్స్ అమరావతి క్యాంపస్‌ను మూడు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మొదటి దశలోనే సుమారు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో పనులు ప్రారంభించనున్నారు. 2027 నుంచి అమరావతి క్యాంపస్‌లో విద్యార్థులకు ప్రవేశాలు లభించేలా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి విద్యా హబ్‌గా రూపాంతరం చెందే దిశలో ఓ భారీ ముందడుగు పడింది. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం.. బిట్స్ పిలానీ సంస్థకు అవసరమైన భూమిని కేటాయించింది. తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెం పరిధిలో మొత్తం 70.011 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో బిట్స్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల మధ్య శుక్రవారం భూ విక్రయ ఒప్పందం పూర్తయింది.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు. జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మోరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

# 4 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి

కాకినాడలో పర్యటించిన జేఎన్‌టీయూలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్ర చేసిన తర్వాత చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. ప్రతి నెలా విద్యార్థులతో మాట్లాడతానని.. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహిస్తామని తెలిపారు. తాను చిన్నప్పుడు బట్టీ పట్టి చదవలేదని, పాఠం మొత్తం విని నేర్చుకునేవాడినని గుర్తుచేశారు. కుంభమేళా కార్యక్రమం చూసి క్రౌడ్ మేనేజ్‌మెంట్ నేర్చుకున్నానని తెలిపారు. 'డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మొదటిసారి హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికి భోజనానికి పిలిచినప్పుడు చూశాను. ఆ తర్వాత రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. కష్టకాలంలో తోడుగా వచ్చిన వారిని ఎప్పుడూ మరచిపోకూడదు. మీరు కూడా ఈ విషయం గుర్తుంచుకోవాలి' అని విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో కొంతమంది గొడవలు పెడుతున్నారని, ఏ కుటుంబంలో పుడతామో ఎవరి చేతుల్లోనూ ఉండదని చెప్పారు. కెమికల్ ఇంజనీరింగ్ మంచి కోర్సు అని, భవిష్యత్తులో అనకాపల్లిలో కెమికల్ ఫార్మా కంపెనీలు పెడతామని లోకేశ్ తెలిపారు. త్వరలో రాష్ట్రానికి 760 కంపెనీలు తీసుకొస్తున్నామని, అగ్రికల్చర్ ఎంత ముఖ్యమో.. పరిశ్రమలు కూడా అంతే ముఖ్యమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దావోస్ వెళ్లి వచ్చిన తర్వాత విశాఖపట్నంలో చాలా కంపెనీలకు శంకుస్థాపన చేశామని చెప్పారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'మీరెప్పుడైనా క్లాస్‌లకు బంక్ కొట్టారా?' అని విద్యార్థులు అడగగా, లోకేశ్ నవ్వుతూ 'తాను ఎప్పుడు బంక్ కొట్టలేదు' అని సమాధానమిచ్చారు. తాను ఎంబీఏ చదువుతున్న సమయంలో 90శాతం అటెండెన్స్ ఉందని, తన భార్య బ్రాహ్మణికి 100 శాతం అటెండెన్స్ ఉందని ఆయన చెప్పారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా సంభాషించిన లోకేశ్.. వారి సందేహాలను నివృత్తి చేశారు.

# ఐపిఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మతమార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

# ప్రశంసలు కాదు.. పనిపై శ్రద్ధ పెట్టండి

తీసుకోవాలని అధికారులకు సూచించారు. పనిలో అలసత్వాన్ని అస్సలు సహించబోమని మరోసారి స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పూర్తి చేశామని పవన్ కల్యాణ్ తెలిపారు. ఒకేసారి దాదాపు 10 వేల మందికి ప్రమోషన్లు కల్పించడం ద్వారా ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకున్నామన్నారు. అధికారులు పొందిన ఈ సంతోషం ప్రజల్లోనూ కనిపించాలన్నారు. ఉమ్మడి కడప జిల్లాలో ఎంపీడీవోపై దాడి ఘటన చోటుచేసుకున్నప్పుడు స్వయంగా అక్కడికి వెళ్లి భరోసా ఇచ్చామని గుర్తు చేశారు. అధికారులు కష్టాల్లో ఉంటే ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కష్టపడుతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పెద్దల మద్దతు కూడగట్టి నిధులు సాధిస్తున్నామని చెప్పారు. ఆ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు సమర్థంగా పని చేయాలని కోరారు. ప్రజల సంక్షేమం, సంతోషమే లక్ష్యంగా పని చేయాలని, కూటమి ప్రభుత్వ సంకల్పానికి అధికారులు పూర్తి స్థాయిలో తోడుగా నిలవాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

నంది పత్రిక

శనివారం 31 - 01 -2026

# శ్రీశైలం దేవస్థానంలో వైభవంగా స్వర్ణరథోత్సవం





**శ్రీశైలం జనవరి 30 (నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా రథోత్సవంలో సంప్రదాయ నృత్యం, ఏర్పాటు చేయబడింది. ఈనాటి స్వర్ణరథోత్సవంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు, అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.





## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి- సిపిఎం

**వి బి. జి. రామ్. జి పేరు ను రద్దు చేయాలి.**



**బేతంచెర్ల జనవరి 30 ( నందిపత్రిక).** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను, వ్యవసాయ కూలీలు, ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎల్లయ్య, సాదిక్ హుస్సేన్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మధు శేఖర్ లు కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా, మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సాదిక్ హుస్సేన్, ఎల్లయ్య గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించేందుకు, సవరణలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతిజ్ఞ ను చేయించారు. ఈ కార్యక్రమాన్ని సిపిఎం పార్టీ పట్టనాయకులు ఖాజాబాష అధ్యక్షతన వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.కేంద్ర ప్రభుత్వం తీసుకు రానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (విబి–జి రాం జి) పేరుతో ఉపాధి హామీ పథకానికి “రాంరాం” పలకనున్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి, ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్‌ను బట్టి, ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి, అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు పెట్టడం అంటే, ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమే. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు, ఈ పథకంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించారు. 10 శాతం నుండి 40 శాతానిక కేంద్రం ఇస్తున్న 90% నిధులను 60 శాతానికి నాలుగు వేల కోట్ల ప్రభుత్వానికి క టెక్నాలజీని వినియోగించ వచ్చని చెప్పారు, బయోమెట్రిక్ పెట్టి రెండు పూటల పని చేయాలని పని ప్రదేశాలలోనే పరోక్షంగా వెట్టి చాకజాబ్ కార్డులను ఆధార్ తో అనుసంధానం చేసి దేశంలో ఒక కోటి జాబు కార్డులు రద్దు చేశారన్నారు. కూలీలు, చట్టానికి వ్యతిరేకంగా జరుగు ఉద్యమంలో భాగస్వాములు కావాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ నాయకులు రామాంజనేయులు, మద్దిలేటి స్వామి,రాజు, శ్రీనివాసులు, స్వామి నాయుడు, హరికృష్ణ, మధు, లోకేష్, రమణారెడ్డి, జలంధర్, మద్దిలేటి, నారాయణ, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆకారంలో ఉన్న వెన్నెముకను సరిచేసిన కిమ్స్ కర్నూలు వైద్యులు డా. షేక్ మన్నన్ & డా. కిరణ్ కుమార్



**కొన్నేళ్లుగా తలనొప్పి, సరిలేని నడక**

**కర్నూలు కిమ్స్‌లో 30 స్క్రూలతో సంక్లిష్టమైన శస్త్రచికిత్స**

**పూర్తిగా తగ్గిన వెన్నెముక వంపు**

**ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా సర్జరీ**

**రాయలసీమ ప్రాంత్రంలో అత్యంత క్లిష్టమైన 100కు పైగా వెన్నుముక సర్జరీలు**

**కర్నూలు, నంది పత్రిక....**కర్నూలు జిల్లా వామసముద్రం గ్రామానికి చెందిన 18 ఏళ్ల అమ్మాయికి చాలా ఏళ్లుగా విపరీతమైన తలనొప్పి, నడక సరిగా లేకపోవడం, వెన్నెముక వంకరతో బాధపడుతోంది. ఆమె తండ్రి విష్ణు టైలర్ వృత్తి చేసుకుంటూ జీవితం గడుపుతున్నారు. తల్లి నిర్మల గృహిణి. పేద కుటుంబం కావడంతో ఖర్చులు భరించలేక తొలుత స్విమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ 2019లో తల వెనుక మెదడులో ఉన్న లోపానికి (ఆర్నాల్డ్–కియారీ మాల్‌ఫార్మేషన్) శస్త్రచికిత్స చేశారు. దాంతో తలనొప్పి తగ్గినా, వెన్నెముక వంకర అలాగే కొనసాగింది. ఈ ఆరేళ్లలో అది మరింత పెరిగి, గూనిలా మారింది. ఇలాంటి పరిస్థితిలో శస్త్రచికిత్స చేస్తే ప్రాణాపాయం, లేదా శాశ్వత వైకల్యం లాంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో.. ఆ యువతిని కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి తీసుకవచ్చారు. కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ డాక్టర్ షేక్ మన్నన్ మరియు ఆర్థోపెడిక్స్ డిపార్ట్మెంట్ చీఫ్ కన్సల్టెంట్, హెచ్ఓడి డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడ ఆమెకు పరీక్షలు చేసి, అనంతరం చికిత్స చేసిన డాక్టర్ షేక్ మన్నన్ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు.ఈ కేసులో రిస్క్ చాలా ఎక్కువగా ఉండడంతో కంటిన్యువస్ ఇంట్రా ఆపరేటివ్ న్యూరోమానిటరింగ్ కింద శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించాం. గూని సరిచేయడంతో పాటు డి2 నుంచి ఎల్4 వరకు ఉన్న వెన్నెముకను సరిచేయాలని భావించాం. వెన్నెముక వంపు దాదాపు 50 డిగ్రీల వరకు ఉంది. అత్యంత సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సలో మేం దాదాపు 90–95% వరకు సరిచేయగలిగాం. ఈ ప్రక్రియలో 30 ప్రత్యేక స్క్రూలు ఉపయోగించి వెన్నెముకను సరిచేశాం. దీంతో అది మామూలు పరిస్థితికి వచ్చింది. ఇంతకుముందు ఎడమ భుజం పైకి లేచి ఉండేది, అది ఇప్పుడు సాధారణంగా మారింది. రెండు భుజాలు ఒకే స్థాయిలో ఉంటున్నాయి. వీపు భాగంలో బయటకు పొంగిన ఎముకల ఉబ్బుతనం స్పష్టంగా తగ్గింది. వెన్నెముక వంకర గణనీయంగా తగ్గిపోయింది. శస్త్రచికిత్స అనంతరం మొదటిరోజే చిన్నారి సొంతంగా, సులభంగా నడవగలిగింది. ఆమె జీవక్రియలన్నీ సాధారణ స్థితికి చేరుకున్నాయి. అనస్థీషియా బృందం డాక్టర్లు భువన, డా. శృతి, ఆర్థోపెడిక్ సర్జన్ డా. కిరణ్ కుమార్, క్రిటికల్ కేర్ డా. రాజేష్ రెడ్డిల సహకారంతో విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు. డా. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ” రాయలసీమ ప్రాంతంలోనే అత్యంత సంక్లిష్టమైన వెన్నెముక శస్త్రచికిత్సలలో తొలి న్యూరోమస్క్యులర్ స్కోలియోసిస్ శస్త్రచికిత్స విజయవంతంగా చేయగలిగాం. ఈ విజయంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రి మరోసారి తన వైద్య నైపుణ్యాన్ని, మానవీయ విలువలను చాటుకుందన్నారు” కిమ్స్ కర్నూలు రీజినల్ సీఓఓ సిద్దారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఈ సంక్లిష్టమైన శస్త్రచికిత్సను పూర్తిగా ఉచితంగా చేశామని వెల్లడించారు. కర్నూలు జిల్లాలోనే కాకుండా రాయలసీమ ప్రాంత్రంలో అత్యంత క్లిష్టమైన 100కు పైగా వెన్నుముక సర్జరీలు చేయడం మాకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.




## ఘనంగా విరాట్ విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవం,



**కర్నూలు నంది పత్రిక.....** ఘనంగా విశ్వకర్మ పీఠం చారిటబుల్ ట్రస్ట్ గుంటూరు వారి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవం, నిర్వహించారు. శ్రీ గిరి నాగమాంబ వరలక్ష్మి ధర్మ నిలయం నందు ఉదయం 6గంటల నుండి అత్యంత వైభవంగా జరిగినది. మొదటగా గణపతి పూజా పుణ్యాహావాచనం, అఖండ దీప స్థాపన, రక్షాబంధన ఆదిత్యాది నవగ్రహ అష్టదిక్పాలక పూజ, కలశ స్థాపన శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని పతాక ఆవిష్కరణ మరియు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవం, పూర్ణాహుతి అత్యంత భక్తి శ్రద్ధలతో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ క్రిస్టీపాటి మాయబ్రహ్మ ఆచారి , విరాట్ విశ్వకర్మ సేవా సమితి వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ మేడూరి రమణ మూర్తి, మరియు నిర్వాహక కమిటీ బ్రహ్మశ్రీ కె. రావణ బ్రహ్మ , బ్రహ్మశ్రీ గౌరీ శంకర్ బ్రహ్మశ్రీ అద్దంకి సుబ్బారావు , బ్రహ్మశ్రీ వంగవోలు హనుమంతరావు , బ్రహ్మశ్రీ శ్రీపతి మహిబ్రహ్మ ఆచారి , బ్రహ్మశ్రీ పిచ్చయ్య ఆధ్వర్యంలో వేద గురువులు, యజ్ఞ, వృత్వికులు బ్రహ్మశ్రీ ఆలూరి సుబ్రహ్మణ్యం , బ్రహ్మశ్రీ ఆలూరి కేశవాచారులు , బ్రహ్మశ్రీ పెద్దవరపు మణి బ్రహ్మచర్యుల పర్యవేక్షణలో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ , మరియు ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు తాలబత్తుల సాయి తిరువళ్ళూరు పద్మావతమ్మ , బ్రహ్మశ్రీ డాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ (యం.డి), సుతారు రాఘవేంద్ర విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది...



## భారీ అనుచర వర్గంతో కాంగ్రెస్ లో చేరిన బీజేపీ మాజీ కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మందుల రామ కృష్ణ.



ఏపీ స్టేట్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ షర్మిల సమక్షంలో ఏఐసీసీ మెంబర్ లక్ష్మీ నరసింహ యాదవ్, మరియు నంద్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి మదిలేటి స్వామి, ఆళ్లగడ్డ ఇంచార్జ్ బరగొడ్ల ఉషన్ భాష, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు & జిల్లా అధికార ప్రతినిధి సంజీవ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న డాక్టర్ మందుల రామ కృష్ణ

**నంద్యాల శిరివెళ్ల : –** భారతీయ జనతా పార్టీ మాజీకిసాన్ మోర్చ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ మందుల రామకృష్ణ తన భారీ అనుచర వర్గంతో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిళ సమక్షంలో విజయవాడ కాంగ్రెస్ పార్టీ భవనంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. శిరివెళ్ల పట్టణానికి చెందిన డాక్టర్ మందుల రామకృష్ణ నంద్యాల జిల్లా వ్యాప్తంగా అభిమానులను కార్యకర్తలను సంపాదించుకొని అనతి కాలంలోనే ఒక బలమైన రాజకీయ శక్తిగా ఎదిగారు. శిరివెళ్ల నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని నలుమూలల నుండి డాక్టర్ మందుల రామకృష్ణ అభిమానులు తరలిరావడం భారీ కానువాతో విజయవాడ వెళ్లి వైయస్ షర్మిల గారి సమక్షంలో జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం డాక్టర్ మందుల రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. సుమారు 100 మంది అనుచరగణంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి భలోపేతానికి కృషి చేస్తానని ఇందిరమ్మ రాజ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తానని మందుల రామకృష్ణ పేర్కొన్నారు.



## అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



**మర్రిపాడు జనవరి 30నంది పత్రిక :** మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ జీ. శ్రీనివాసులు,సీ.ఆర్.ఎం.టి కస్తూరయ్య లు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న సందర్భంగా మండల విద్యాశాఖ కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి–1 తిరుపతయ్య మాట్లాడుతూ అవార్డు గ్రహీతలు ఇరువురు విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో అంకితభావంతో పనిచేస్తూ,అందరి మన్ననలు పొంది గణతంత్ర దినోత్సవ సేవా అవార్డుకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు.మండల విద్యాశాఖ అధికారి–2 ధనలక్ష్మి మాట్లాడుతూ ఇరువురి పనితీరును ప్రశంసిస్తూ వారి సేవలను ఘనంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు,సీ.ఆర్.ఎం.టి లు,సహిత విద్య ఉపాధ్యాయులు,ఆఫీసు సిబ్బందిపాల్గొన్నారు.

నంది పత్రిక

శనివారం 31 - 01 -2026

# కర్నూలు విమానాశ్రయం సమీపంలో డాక్టర్ అబ్దుల్ హక్

## ఉర్దూ యూనివర్శిటీ భవన నిర్మాణ పనులను పునః ప్రారంభించిన మంత్రి టీజీ భరత్



**ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణానికి రూ.కోటి విరాళం ఇచ్చిన మంత్రి టీజీ భరత్**

**కర్నూలు జిల్లా అభివృద్ధికి భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నాం**

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి. భరత్**

కర్నూలు, నంది పత్రిక......కర్నూలు విమానాశ్రయం సమీపంలో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ భవన నిర్మాణ పనులను మంత్రి టీజీ భరత్ పునః ప్రారంభించారు..శుక్రవారం కర్నూలు విమానాశ్రయం సమీపంలో, ఓర్వకల్లు వద్ద మంత్రి టి.జి. భరత్ , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తో కలిసి ఉర్దూ యూనివర్శిటీ భవన పునఃనిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణానికి తన వంతుగా రూ.1 కోటి విరాళం ఇచ్చామన్నారు.. తమ ప్రభుత్వం అధికారంలో కొనసాగి ఉంటే యూనివర్శిటీ భవన నిర్మాణం ఎప్పుడో పూర్తయ్యేదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఉపయోగపడే ఉర్దూ యూనివర్శిటీ, బీసీ భవన్, కాపు భవన్ వంటి ప్రాజెక్టులను ఆపేశారన్నారు. మైనార్టీ ముస్లిం వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మంచి చేసే నాయకులను ప్రజలు గుర్తుంచుకోవాలని మంత్రి తెలిపారు. సరైన విద్యను అందించి, విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని, దావోస్ పర్యటనలో మంత్రి నారా లోకేష్ తో విద్యా వ్యవస్థ పై చర్చించానని మంత్రి వెల్లడించారు. మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారన్నారు. దావోస్ పర్యటనలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని బాగా ప్రమోట్ చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు మార్చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా కర్నూలు జిల్లాకు భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.10వేల కోట్ల పెట్టుబడుల పనులు మొదలయ్యాయని, రానున్న రోజుల్లో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. పాణ్యం శాసనసభ్యులు గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ.. .నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 20142019 కాలంలో ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయడం ద్వారా మైనార్టీల విద్యాభివృద్ధికి బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయానికి సంబంధించిన పనులు ఆగిపోయాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీ పనులకు మళ్లీ ఊపు వచ్చిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ విశ్వవిద్యాలయానికి అవసరమైన ప్రాథమిక మౌలిక వసతుల కోసం జిల్లా కలెక్టర్ ఫండ్స్ ద్వారా రూ.1 కోటి మంజూరు చేయడం జరిగిందని, అందులో రూ.50 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా, విశ్వవిద్యాలయ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు శ్రీ టి.జి. భరత్ తన స్వంత నిధుల నుంచి రూ.1 కోటి ప్రకటించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉర్దూ విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తిచేయడానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఉర్దూ విశ్వవిద్యాలయ నిర్మాణ పనులను పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టంచేశారు. అలాగే, మైనార్టీ ముస్లిం వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఇమామ్‌లు మరియు మౌజన్లకు గౌరవ వేతనాలను పెంచడం వంటి చర్యల ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తోందని తెలిపారు. ఇక ఓర్వకల్లు ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ముఖ్యమైన ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, ఇప్పటికే అనేక పెట్టుబడులు వస్తున్నాయని, దీని ద్వారా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ షా వలి ఖాన్, పారిశ్రామికవేత్త బి.కె సింగ్, ఉర్దూ యూనివర్శిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# బాపూజీ చిత్ర ఫటానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన వాసవీ క్లబ్.



బేతంచెర్ల జనవరి 30 ( నందిపత్రిక) బేతంచెర్ల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీవర్ధంతి సందర్భంగా గాంధీ మహాత్ముడికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించడం జరిగినది,ఈ కార్యక్రమంలో వైస్ గవర్నర్ బొగ్గరపు ధనుంజయ,క్యాబినెట్ సెక్రటరీ బాల్లని సూర్య, మరియు వాసవి క్లబ్ సభ్యులు మరియు ప్రెసిడెంట్ ఎవి రమణ, సెక్రటరీ ఇ.మధు సురేంద్ర,ట్రెజరర్ బి.జగన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ - క్రాప్ నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకూడదు

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



కర్నూలు, నంది పత్రిక.....రైతుల పంటలకు భద్రత కల్పించే కీలకమైన ఈక్రాప్ నమోదు ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా, పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో రైతుల పంట పొలాల్లో సాగు చేసిన వరి పంట ఈక్రాప్ నమోదును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రభుత్వం అందించే పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రుణ మాఫీ, నష్టపరిహారం వంటి ప్రయోజనాలు రైతులకు అందాలంటే ఈక్రాప్ డేటా ఖచ్చితంగా నమోదు కావడం అవసరమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో చిన్నపాటి పొరపాట్లు జరిగినా రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి, పంట రకం, విస్తీర్ణం, సాగు వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. రైతులు కూడా అధికారులకు సహకరించాలని సూచించారు. ఈక్రాప్ నమోదు సమయంలో రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని, సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు కూడా ఈక్రాప్ నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని, తమ పంట వివరాలు సరిగా నమోదు అయ్యాయా లేదా అని పరిశీలించుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, ఆర్డీవో సందీప్, మండల వ్యవసాయ అధికారి మధుమతి, గ్రామ వ్యవసాయాధికారి ఉసేన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లా బిఆర్సీ ల నిజమైన విజయగాథ









**రైతుల వద్దకే జీవ వనరుల ఉత్పత్తులు**

**ప్రకృతి వ్యవసాయం**

**రైతులకు మరింత చేరువ**

నంద్యాల బ్యూరో, జనవరి30(నంది పత్రిక):- నంద్యాల జిల్లాలో కొన్ని సంవత్సరాల క్రితం ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ వనరులు రైతులకు లభించడం ఎంతో కష్టసాధ్యంగా ఉండేది. గ్రామాల మధ్య తిరుగుతూ, అరకొర నాణ్యతతో, అధిక ధరలకు ఇన్‌పుట్స్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. "మా గ్రామంలోనే నాణ్యమైన ఇన్‌పుట్స్ అందుబాటులో ఉంటే ఎంత బాగుంటుందో" అని రైతులు ఆశపడిన రోజులు ఇప్పుడు గతమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామ స్థాయిలోనే జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో బయో రిసోర్స్ సెంటర్లు ఏర్పాటవడం రైతుల జీవితాల్లో సానుకూల మార్పుకు నాంది పలికింది. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం, వాతావరణానికి అనుకూలమైన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని నంద్యాల జిల్లాలో విస్తరింపజేయడంలో ఈ బిఆర్ సీ లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. జిల్లా మరియు డివిజన్ స్థాయిల్లో శిక్షణ పొందిన యజమానులు నూతన విధానాలను అవలంబిస్తూ ప్రకృతి వ్యవసాయ విస్తరణకు విశేషంగా తోడ్పడుతున్నారు. రైతుల పొలాల వద్దకే నేరుగా వెళ్లి, వారికి అవసరమైన జీవ ఉత్ప్రేరకాలు, వివిధ రకాల తెగుళ్ల నివారణకు ఉపయోగించే కషాయాలను అక్కడికక్కడే తయారు చేయడం, నేరుగా పొలాలకు చేర్చడం ద్వారా రైతులకు సులభంగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. లింగాకర్షక బుట్టలు, పసుపు మరియు తెలుపు పల్లాలు వంటి అవసరమైన సాధనాలను కూడా పొలాల్లో ఏర్పాటు చేయడంలో ముందుంటున్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ద్వారా శిక్షణ పొందిన యజమానులచే డోన్‌లోని గిడ్డాంజనేయ, ఆత్మకూరులోని సుభాష్ పాలేకర్ కోవెలకుంట్లలోని సదానంద , ఆళ్లగడ్డ డివిజన్ జిలెల్ల గ్రామంలోని మణికంఠ, , నందికొట్కూరు డివిజన్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర గో-ఆధారిత, నంద్యాల డివిజన్‌లోని అయ్యప్పలు స్థాపించబడి, వివిధ రకాల జీవ వనరులను తయారు చేస్తూ జిల్లా వ్యాప్తంగా వందల గ్రామాల్లో వేలాది మంది రైతులకు సమగ్ర సేవలు అందిస్తున్నాయి. జిల్లాలో ప్రతి మండలంలో బి ఆర్ సి లు స్థాపించబడిన తర్వాత నాణ్యమైన జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయ కషాయాలు రైతులకు సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ కేంద్రాలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయానికి నూతన ఊపిరి పోస్తూ, వేలాది మంది రైతులు లబ్ధి పొందేలా చేస్తున్నాయి. ఈ మార్పును ప్రత్యక్షంగా పరిశీలించినవారిలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గారు ముఖ్యులు. ఇటీవల జిలెల్ల గ్రామంలో కర్రెద్దుల బాల మద్దిలేటి మణికంఠ బి ఆర్ సి ను కలెక్టర్ గారు సందర్శించి, ఇన్‌పుట్స్ తయారీ విధానం, నిల్వ విధానం, గ్రామ రైతుల స్పందనను తెలుసుకొని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘాలు, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కలెక్టర్ గారు రైతులతో నేరుగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "గ్రామాల్లోనే ఇలాంటి ఉండటం వల్ల రైతుల ఖర్చులు గణనీయంగా తగ్గుతున్నాయి. రైతు పొలం పచ్చగా ఉండాలంటే నమ్మకమైన, నాణ్యమైన ఇన్‌పుట్స్ సరైన ధరకు అందుబాటులో ఉండాలి. నంద్యాల జిల్లాలో నిజంగా 'గ్రీన్ ఇంజిన్లు'లా పనిచేస్తూ లక్ష్యాలను సమర్థవంతంగా నెరవేర్చుతున్నాయి" అని ప్రశంసించారు. ఎక్కడికెళ్లినా రైతుల స్పందన ఒక్కటే "మా గ్రామానికి బి ఆర్ సి వచ్చిన తర్వాత ప్రకృతి వ్యవసాయం మాకు మరింత దగ్గరైంది. బీఆర్సి యజమానులు నేరుగా మా పొలాల వద్దకే వచ్చి కషాయాలు అందిస్తున్నారు" అని తెలిపారు. ప్రస్తుతం ఈ బి ఆర్ సి లు కేవలం జీవ వనరుల కేంద్రాలుగా మాత్రమే కాకుండా, మహిళలకు ఉపాధి కల్పించడం, ఆన్‌లైన్ విక్రయాలు, కోల్డ్ ప్రెసింగ్ యూనిట్లు, రైస్ మిల్లులు, డివిజన్ స్థాయి ప్రచార కార్యక్రమాలు వంటి విస్తృత ప్రణాళికలతో రైతు సేవలో కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి. అంతేకాకుండా, ప్రకృతి వ్యవసాయంతో పండించిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా గిట్టుబాటు ధరలకు విక్రయించడం ద్వారా చిన్న రైతుకు కూడా స్థిరమైన ఆదాయం కలిగించే మార్కెట్‌ను సృష్టిస్తున్నాయి. భవిష్యత్తులో డి మార్ట్ తరహాలో రైతులకు అవసరమైన ప్రతిదీ ఒకేచోట అందించే ప్రకృతి వ్యవసాయ సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో అనేక బి ఆర్ సి యజమానులు ముందుకు సాగుతున్నారు. ఒకప్పుడు ఇన్‌పుట్స్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన రైతులు, నేడు "మన గ్రామంలోనే నాణ్యమైన ఇన్‌పుట్స్ సరైన ధరకు అందుబాటులో ఉన్నాయి" సంతృప్తిగా చెబుతున్నారు.

**జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా**

**ఘన నివాళులు అర్పించిన టీడీపీ యువ నాయకులు ఫయాజ్**



నంద్యాల సిటీ బ్యూరో జనవరి 30 ( నంది పత్రిక ) జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా, నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి టీడీపీ యువ నాయకులు చీవీణ ఫయాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా చీవీణ ఫయాజ్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో అఖండ భారతావనికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించి పెట్టిన మహనీయుడు మహాత్మా గాంధీ గారని, ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలు, విలువలు ప్రతి భారతీయుడు తన జీవితంలో ఆచరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నామని చీఎం ఫయాజ్ అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల నియోజకవర్గ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# పోలీసు డైరీని ఆవిష్కరించిన ... కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ .

కర్నూలు నంది పత్రిక...... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రూపకల్పన చేసిన 'పోలీసు డైరీ - 2026' ను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ డైరీలో పోలీసు అధికారులకు మరియు పోలీసు సిబ్బందికి నిత్యం అవసరమయ్యే అన్ని రకాల కీలక సమాచారాన్ని పొందుపరచడం పై కర్నూలు ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు.ఈ డైరీ విధుల్లో ఉన్న పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్పీ ప్రశంసించారు.ఈ పోలీసు డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, అసోషియేషన్ సెక్రటరి స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు , జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, కోశాధికారి చంద్రశేఖర్, కార్యనిర్వహక సభ్యుడు ఖాజా బందా, కార్యనిర్వహక సభ్యులు వెంకటేశ్వరరావు, మల్లికార్జున, రాష్ట్ర కో - ఆప్షన్ సభ్యుడు కిశోర్ కుమార్ పాల్గొన్నారు.



# కుష్ఠు వ్యాధిపై అవగాహనే ప్రధాన ఆయుధం



**ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి**

వెలుగోడు, జనవరి 30 (నంది పత్రిక): ఆంధ్రప్రదేశ్ వాలంటరీ హెల్త్ అసోసియేషన్ వారి సహకారంతో, స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ కుష్ఠు వ్యాధి దినోత్సవాన్ని శుక్రవారం వెలుగోడు పట్టణంలోని స్థానిక ఎంపీడీవో ఆఫీస్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ పి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, కుష్ఠు వ్యాధి బాక్టీరియా వల్ల కలిగే వ్యాధి అని, ఇది ముఖ్యంగా చర్మం మరియు నరాలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. వ్యాధి లక్షణాలు తెలిసిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకుంటే ఇది ప్రమాదకరం కాదని, ప్రజల్లో సరైన అవగాహన కల్పించడం అత్యంత అవసరమని ఆయన అన్నారు. సమావేశం అనంతరం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. పి. జహీర్ వలి మెడికల్ ఆఫీసర్, వెల్పనూరు పీహెచ్‌సీ, డా. ఎస్. నజీర్ అహ్మద్ మెడికల్ ఆఫీసర్, వెలుగోడు పీహెచ్‌సీ, శ్రీదేవి సూపర్‌వైజర్ (ఎంపీహెచ్‌ఎస్), మధుసూదన్ రెడ్డి ఎంపీహెచ్‌ఎస్, బి. శ్రీనివాసులు ఎంపీహెచ్‌ఈఓ, వెల్పనూరు, స్టార్ యూత్ అసోసియేషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. ఖాదర్ వలి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేశారు.



## శ్రీశైలంలో కరివేన బ్రాహ్మణ సత్రం ప్రాహారీగోడ కూల్చివేత సనాతన ధర్మం..

# హిందూ సమాజానికి కలంకం...వైసీపీ



నంద్యాల సిటీ బ్యూరో జనవరి 30 ( నంది పత్రిక ) జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంభికా మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీశైలంలో కరివేన బ్రాహ్మణ సత్రం ప్రాహారీ గోడను కూటమి ప్రభుత్వం శ్రీశైలం ఎమ్మెల్యే సమక్షంలో ఆయన ప్రోద్బలంతో దుర్మార్గంగా ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా శ్రీశైల దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆద్వర్యంలో కూల్చి వేయడం సనాతన ధర్మం, హింధూ సమాజానికి తీవ్ర కలంకం అని ఈ చర్యను వైఎస్సార్సీపీ తరుపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఖండిస్తున్నామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లోని శ్రీశైలం నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కరివేన సత్రం ప్రాహారీ గోడ కూల్చివేతపై వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ... కరివేన సత్రం ప్రాహారీ గోడ కూల్చివేత హింధూ సమాజం తలదించుకోవలసిన చర్యలని, తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. శ్రీశైలంలో 130 సంవత్సరాల చరిత్ర కలిగిన కరివేన బ్రాహ్మ బ్రాహ్మణ ణ అన్నసత్రం ప్రాహారీ గోడను శ్రీశైలం ఎమ్మెల్యే ప్రోద్బలంతో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి సంబంధిత సత్రం నిర్వాహకులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చడం దుర్మార్గమైన చర్యలన్నారు. ఈ ప్రాహారీ గోడను శ్రీ భ్రమరాంభికా మల్లికార్జున స్వామి సాక్షిగా తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు. రానున్న మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్న సాకుతో కరివేన బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం ప్రాహారీ గోడను నిర్ధాక్షిణ్యంగా కూల్చివేతను హింధూ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదన్నారు. సనాతన ధర్మం కాపాడాలని చెబుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సత్ బ్రాహ్మణలచే నిర్వహిస్తున్న అన్నదాన సత్రం ప్రాహారీ గోడ కూల్చడం హింధువుల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. భగవంతుని జోలికి వస్తే ఎవ్వరికైనా పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. దేవాలయాలను, అన్నదాన సత్రాలను ప్రధాన అంశంగా తీసుకొని రాజకీయం చేయడం తగదన్నారు. తిరుపతి లడ్డు తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వులను కలిపారని, కల్తీ జరిగిందని రాద్ధాంతం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నేడు ధర్యాప్తు బృందం అయిన సిట్ ఇచ్చిన నివేదికలో లడ్డుకు వాడిన నెయ్యిలో ఎటువంటి జంతువుల కొవ్వులను కల్తీ చేయలేదని నిగ్గుతేల్చారని దీనికి ఆయన ఏమి సమాధానం చెబుతాడో ప్రజలకు తెలియాలన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేందుకు రాజకీయం చేయడం పవన్ కళ్యాణ్ కు తగదన్నారు. శ్రీశైలంలో కరివేన బ్రాహ్మణ సత్రం ప్రాహారీ గోడ కూల్చివేత తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... దేవాదాయశాఖ అధికారులు కరిపేన సత్రం నిర్వాహకులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం సరికాదని అన్నారు. బ్రహ్మణులు దైవానికి భక్తునికి మధ్య సారధులని వారిచేత నడుపబడుతున్న సత్రం ప్రాహారీగోడ కూల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం హింధూ దేవాలయాల పరిరక్షణపై నిబద్ధత లేదని అన్నారు. తిరుపతి లడ్డు తయారీలో కల్తీపై నిజానిజాలు బయటపడ్డాయని, కూటమి ప్రభుత్వం ఈ విషయంపై రాజకీయం చేశారని అన్నారు. ఆవునెయ్యిలో కల్తీ చేయడం జరగదని, ఇటువంటి వాటిపై అసత్యపు ఆరోపణలు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. హింధూ దేవాలయాల అభివృద్ధిపై వైఎస్సార్సీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, శిల్పా భువనేశ్వరరెడ్డి, నంద్యాల పార్లమెంట్ స్టేట్ సెక్రటరీ సద్దలసూర్యనారాయణరెడ్డి, మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



## పార్నపల్లెలో లేగ దూడల ప్రదర్శన



బండి ఆత్మకూరు నంది పత్రిక జనవరి 30 : శాస్త్రీయ పద్ధతులలో లేక దూడలను పెంచడం వల్ల రైతులు అధిక లాభాలను పొందవచ్చునని కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్ అన్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ పథకంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్ తో పాటు ఏడీఏ వెంకటేశ్వర్లు టిడిపి కన్వీనర్ ముమ్మడి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్ మాట్లాడుతూ దూడలకు తగు మోతాదులో యాక్షన్ వేయించడం వల్ల దూడలు ఆరోగ్యకరంగా ఉంటాయని అన్నారు. నేటి దూడలే రేపటి పాడి పశువులు కాబట్టి దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులను త్రాగిస్తూ వ్యాధి నిరోధక టీకాలను సరియైన సమయంలో వేయించుకొని జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. వెలుగోడు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు లింగ నిర్ధారిత వీర్యాన్ని వినియోగించుకొని 90% పెయ్యదూడలను పొంది తద్వారా పాల ఉత్పత్తిని పెంచుకునేలా రైతులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నాగ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం కొరకు మినీ గోకులాలు హరిత గోపాల ద్వారా పశుగ్రాసాల సాగును వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. లేక దూడల ప్రదర్శన కార్యక్రమంలో 84 దూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రైతులకు లివర్ టానిక్కులు, మినరల్ బ్లాకులు నాగ కృష్ణారెడ్డి రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సహాయ సంచాలకులు డాక్టర్ మల్లన్న, పార్నపల్లె పశువైద్యాధికారి జోష్నాదేవి, బండి ఆత్మకూరు వైద్యాధికారి అనూషాలతో పాటు వైద్యాధికారులు కిషోర్ కుమార్ రెడ్డి,ప్రత్యూష జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సాయి చందు, ఆహాలు సమీరా లక్ష్మి ప్రసన్న,ఉమామహేశ్వరి, జయశ్రీ,శివశంకర్ రెడ్డి, సతీష్, అర్జున్,రామకృష్ణ, గోపాలమిత్ర శేఖర్ లతోపాటు రైతు సోదరులు తెలుగుదేశం పార్టీ చెందిన వివిధ నాయకులు పాల్గొన్నారు.

## కర్నూలు విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి



కర్నూలు, నంది పత్రిక.....కర్నూలు విమానాశ్రయంలో విమాన కార్యకలాపాలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కర్నూలు ఎయిర్పోర్ట్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏరోడ్రోమ్ కమిటీ, ఎయిర్ ఫీల్డ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కమిటీ సమావేశాలను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ల మాట్లాడుతూ... ఎయిర్పోర్టు సమీపంలో నిర్ణయించిన 20 కిలోమీటర్ల పరిధి లోపు ఎత్తైన భవనాలు, విండ్ మిల్స్ , ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయకుండా పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకొనవలసిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలని సూచించారు. అందుకు తగ్గట్టు ఎయిర్ పోర్ట్ నుండి బయటకు వెళ్లేందుకు, లోపలకు రావటానికి రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చుట్టుపక్కల గ్రామాల లో చనిపోయిన పశువుల కళేబరాలు పడవేయకుండా, వాటి ద్వారా పక్షులు సమీపంలో చేరకుండా వారికి అవగాహన కల్పించాలని ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ ను ఆదేశించారు. ఎయిర్పోర్టు పరిసరాలలో ఉన్న నాలుగు పరిశ్రమలు, మైనింగ్ లలో దుమ్ము పొగ రాకుండా ఎప్పటికప్పుడు వారికి ఆదేశాలు జారీ చేస్తూ ఉండాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డిని ఆదేశించారు. క్రాస్ ఫైర్ టెండర్స్ రాకపోకలకు గాను మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించి మార్చి 31 లోపల అందజేయాలని, అలాగే డంపింగ్ యార్డ్ కొరకు అర ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు తహసిల్దార్ విద్యాసాగర్ ను ఆదేశించారు. విమానాలు రాత్రిపూట రాకపోకలు కొనసాగించడానికి కావలసిన ఏర్పాట్లకు సంబంధించి నివేదికను రూపొందించాలని డైరెక్టర్ ను ఆదేశించారు.మెల్ స్టార్ ఏవియేషన్ సంస్థ ద్వారా పైలెట్ ట్రైనింగ్ కోర్సులను త్వరితగతిన నిర్వహించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ను ఆదేశించారు.ఎయిర్పోర్ట్ లో పచ్చదనం పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ డైరెక్టర్ ను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ భవనంలో ఉన్న సి ఎన్ ఎస్ పరికరాలను , పనిచేసే తీరును ,క్రాస్ ఫైర్ టెండర్ పనితీరును పరిశీలించారు. సమావేశం లో ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ , డిఆర్ఓ వెంకట నారాయణమ్మ , కర్నూల్ ఆర్డిఓ సందీప్ కుమార్ , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , డిఎం అండ్ హెచ్ వో భాస్కర్ , ఓర్వకల్లు తహసిల్దార్ విద్యాసాగర్ , ట్రాన్స్కో డిఇ సుబ్బన్న , డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ఓబులేసు , ఇండిగో మేనేజర్ ఖాజా మొయిద్దీన్ , బిఎస్ఎన్ఎల్ ఏ జి ఎం శ్రీనివాస్ , స్టేషన్ మేనేజర్ నాగరాజు , ఐబి పుష్పరాజు , ఎయిర్పోర్ట్ ఇన్స్పెక్టర్ కంబగిరి రాముడు , ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ పాల్గొన్నారు.

## ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా

## పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలి



### జిల్లాలో 75 సెంటర్లలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ

### ప్రతి పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, నంది పత్రిక....ఫిబ్రవరి 23 వ తేది నుండి మార్చి 24 వ తేది వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 23 వ తేది నుండి మార్చి 24 వ తేది వరకు 75 సెంటర్ల లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ జనరల్ లో 43, 379 (మొదటి సంవత్సరం 23,140, రెండవ సంవత్సరం 20,239) మంది విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు.. అదే విధంగా ఇంటర్మీడియట్ వొకేషనల్ లో 5, 285 (మొదటి సంవత్సరం 3,271, రెండవ సంవత్సరం 2,014) మంది విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 2 వ తేది నుండి మార్చి 13 వ తేది వరకు 6 సెంటర్ల లో నిర్వహించడం జరుగుతుందన్నారు. 1359 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. ప్రశ్నా పత్రాల భద్రతకు ఆర్మ్డ్ గార్డ్స్ ఏర్పాటు తో పాటు పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.. ప్రశ్నా పత్రాలు స్టోరేజ్ పాయింట్ నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే వరకు పోలీసు ఎస్కార్ట్ ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఎగ్జామినేషన్ హాల్ లో త్రాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు..




పరీక్ష కేంద్రాల్లో సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.. ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అవసరమైన మందులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారిని ఆదేశించారు.సమావేశంలో ఆర్ఐఓ లాలప్ప, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోక్ రాజ్ , డి ఈ ఓ సుధాకర్, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ డి ఈ ఈ నరేష్, 3 టౌన్ ఎస్ఐ పీరయ్య, కలెక్టరేట్ ఏఓ శివరాముడు, అసిస్టెంట్ కమిషనర్ లేబర్ సాంబ శివ, ఏపీ ఎస్పీడీసీఎల్ డిఈ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

### నగరపాలక డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి



కర్నూలు నంది పత్రిక.... అహింస అనే ఆయుధంతో ఏదైనా సాధించవచ్చని ప్రపంచానికి చాటి చెప్పిన జాతిపిత మహాత్మా గాంధీజీని నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. అహింస, శాంతి నినాదాలతో బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టిన ఘనత మహాత్మాగాంధీకి దక్కుతుందని తెలిపారు. సత్యం, నైతిక విలువలు, దేశభక్తి వంటి సిద్ధాంతాలు నేటి యువత జీవితానికి దిశానిర్దేశం చేయగలవని పేర్కొంటూ, గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడిచినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు.కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# రాంజీ చట్టాన్ని తిప్పికొట్టి, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం



### - ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

కొత్తపల్లి - నంది పత్రిక : ఉపాధి కూలీల ఉసురు తీసేందుకు బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి జి రాంజీ చట్టాన్ని తిప్పి కొట్టి,పేదల కడుపు నింపే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఐక్యంగా కాపాడుకుందాం అని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు పిలుపునిచ్చారు శుక్రవారం మండలంలోని సింగరాజు పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఉపాధి కూలీలతో కలిసి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాదురామ్ గాడ్సే మహాత్మా గాంధీని తుపాకితో కాల్చి ఉసురు తీస్తే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ పేదల కడుపు నింపే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పీక నొక్కి ఉపాధి కూలీల ఉసురుదిస్తున్నారని ఆరోపించారు వికసిత్ భారత్ పేరుతో వినాశనకరమైనటువంటి చట్టాలను తీసుకువచ్చి పేదలు, వ్యవసాయ కూలీలు,రైతులు, ఉద్యోగులు, కార్మికుల యొక్క జీవితాలను అంధకారం లోకి తీసుకువెళ్లి, సంపన్నుల కోసమే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు పేదల హక్కుగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్గార్ అజీవికా మిషన్(గ్రామీన్) తీసుకువచ్చారు జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించి గాంధీని హత్య చేసిన రాంజీపేరు వచ్చేలాగా చట్టాన్ని రూపొందించారని,పేరు మార్చడమే కాకుండా చట్టంలో ఉపాధి కూలీలను పని పొందే హక్కునుతొలగించి స్కీమ్ గా మార్చారు దీనివల్ల ఉపాధి కూలీలు పని పొందాలంటే ప్రభుత్వ దయాదక్షిణలపై ఆధారపడవలసి వస్తుందన్నారు వ్యవసాయ సీజన్లో ఉపాధి పనులను పెట్టకుండా మార్పులు చేశారు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వల్ల గ్రామీణ పేదలు చిన్న సన్న కారు రైతులు బీడు భూములు సాగులు తెచ్చుకోవడం జరిగింది.నీటి వనరులను ఏర్పాటు చేసుకోవడం గ్రామీణ మౌలిక సదుపాయాలు కల్పించడం గిరిజనులకు వికలాంగులకు మహిళలకు పురుషులతో పాటు సమానంగా వేతనాలు పొందే అవకాశం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో ఉండేది కానీఈ కొత్త చట్టం వల్ల ఈ అవకాశాలన్నీ రద్దు అయి పోతాయి. ఉపాధి కూలీలకు 100% వేతనాల ఖర్చు భరించాల్సి ఉండగా. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై 40 శాతం భారాన్ని మోపిందని రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోతే ఉపాధి కూలీలకు పనులు ఉండవని పనులు అడిగే హక్కు కూడా ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు అందుకే కేంద్ర ప్రభుత్వం కూలీల కడుపు కట్టేందుకు తీసుకువచ్చిన వి బిజీ రాంజీచట్టాన్ని తిప్పి కొట్టి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు గ్రామీణ పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి ఏసన్న శేఖర్ సంసోను కృపాకర్ మరియమ్మ రూతమ్మ సౌందర్రాజు మనోహర్ తదితరులు పాల్గొన్నారు

# కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రం 'ప్రేమ కడలి' పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల జనవరి 30 (నంది పత్రిక):** పోరుమామిళ్ల శ్రీ వెంకటేశ్వర సినిమా హాల్లో ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన చిత్రం 'ప్రేమ కడలి' తొలి షోను మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి గారు వీక్షించారు. ఈ సినిమాలో నటించిన నటీనటుల ఆహ్వానం మేరకు ఆయన సినిమా వీక్షించారు.

**సినిమా చూసిన అనంతరం ఆయన మాట్లాడుతూ** : పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన బి.కోడూరు మండలం పాయలకుంట్ల గ్రామానికి చెందిన పిల్లిబోయిన నాని, కాశీనాయన మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన ఎర్రిచెర్ల సుబ్బారెడ్డి ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించడం గర్వకారణమన్నారు. ఈ చిత్రం కుటుంబ సమేతంగా అందరూ చూడదగిన సినిమా అని, ముఖ్యంగా నేటి యువత తప్పకుండా చూడాల్సిన సినిమా అని పేర్కొన్నారు. పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని ఈ సినిమా ఇస్తుందన్నారు.గ్రామీణ నేపథ్యంతో సహజంగా, గ్రాఫిక్స్, దూపులు, అశ్లీలత లేకుండా నిర్మించిన చిత్రం 'ప్రేమ కడలి' అని తెలిపారు. ఇటువంటి కుటుంబ విలువలతో కూడిన సినిమాలు ఈ మధ్యకాలంలో చాలా అరుదుగా వస్తున్నాయని అన్నారు. మన ప్రాంత యువకులు నటించిన ఈ చిత్రాన్ని రాయలసీమ భాషా సంస్కృతులతో రూపొందించారని ప్రశంసించారు. ఈ సినిమాలో నటించిన నటీనటులను అభినందిస్తూ, ప్రజలందరూ ఈ చిత్రాన్ని చూసి ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి చిత్రాలు నిర్మించి, నటించి మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# దోమకాటు ప్రమాదకరం సబ్ యూనిట్ అధికారి టి. నరసింహారెడ్డి



**బద్వేల్ జనవరి 30( నంది పత్రిక):** దోమకాటు ప్రమాదకరమని నివారణ చర్యయే శ్రేయస్కరమని, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి. నరసింహా రెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో శుక్రవారం ఆనంద నగర్ గ్రామంలో, ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఇంటింటి సర్వే నిర్వహించి, ఫీవర్, లార్వా సర్వే చేయడం జరిగింది. లార్వాను గుర్తించి నీటిని పడవేయడం జరిగింది. ఫ్రిడ్జ్, కూలర్లను పరిశీలించి శుభ్రత పై అవగాహన కల్పించడం జరిగింది. తడి, నీటి కుంటలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయడం జరిగింది. బ్లీచింగ్ పౌడర్ ను చల్లించడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, దోమల నివారణ అవుతుందన్నారు. శుభ్రతలను పాటిస్తే భవిష్యత్తులో జబ్బులు వచ్చే అవకాశం లేదన్నారు. దోమలు పుట్టకూడదు- కుట్టకూడదన్నారు. జబ్బులు చేస్తే ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవాలన్నారు .విలేజ్ హెల్త్ క్లినిక్లు, 104 లలో కూడా వైద్యం చేయించుకొని, ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, సిహెచ్ఓ వీణ, వైద్య సిబ్బంది దీపిక, సునీత ఏఎన్ఎంలు ,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే డా. దాసరి సుధ సేవల మెరుగుదలపై ఆదేశాలు



**పోరుమామిళ్ల జనవరి 30 నంది పత్రిక):** పోరుమామిళ్ల సీహెచ్‌సీ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డా. దాసరి సుధ పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది పనితీరుపై సమగ్రంగా సమీక్షించారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరం 20242025కు సంబంధించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించలేదని గుర్తించిన ఆమె, 20252026 సంవత్సరానికి కేటాయించిన రూ.1,68,000 నిధులను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్రతిరోజూ 300 నుంచి 400 వరకు ఓపీ నమోదవుతున్నప్పటికీ, ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన 12 మంది డాక్టర్ల స్థానంలో కేవలం 9 మంది మాత్రమే పనిచేస్తున్నారని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే, డాక్టర్లు మరియు సిబ్బంది రోగులను బాధ్యతగా చూసుకోవాలని, సిబ్బంది లోటు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండేళ్లుగా వినియోగంలో లేని ఎక్స్‌రే యంత్రం గత నవంబర్ నెల నుంచి పనిచేస్తున్న విషయాన్ని రోగులకు తెలియజేయాలని, అలాగే గుండెకు సంబంధించిన కీలకమైన ఇంజక్షన్ రూ.40 వేల విలువైనది ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నదన్న సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా పరిశీలించి, అవసరమైన మెరుగుదల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో ఉన్న రోగులతో నేరుగా మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పలు రికార్డులను పరిశీలించి ఆసుపత్రి నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైసీపీ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీపీ బాషా, జడ్పీటీసీ ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ రవి ప్రకాశ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, శివ, ఆసుపత్రి సూపరింటెండెంట్ శివకృష్ణతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# డ్వాక్రా మహిళల ఆర్థిక అభివృద్ధికి తృప్తి క్యాంటీన్ ఏర్పాటు

**తృప్తి క్యాంటీన్ దినదినాభివృద్ధి చెందాలి**

**రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్**

**డ్వాక్రా మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జనవరి 30(నంది పత్రిక):-** డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. శుక్రవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తృప్తి క్యాంటీన్‌ను రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్వాక్రా మహిళలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మెప్మా ద్వారా తృప్తి క్యాంటీన్ ప్రారంభించామని తెలిపారు. ఈ క్యాంటీన్‌ను హైవే రోడ్డుకు సమీపంలోని అనుకూల ప్రాంతంలో ఏర్పాటు చేశామని, ఇది 24 గంటల పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో బస్సుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో క్యాంటీన్‌కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రోజుకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వచ్చేలా రుచికరమైన టిఫిన్లు, భోజనాలను తయారు చేసి విక్రయించాలని డ్వాక్రా మహిళలకు మంత్రి సూచించారు. మహిళల అభివృద్ధికి అనుకూలమైన స్థలాన్ని కేటాయించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లకు మంత్రి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గత వారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోనే అరకు కాఫీ షాప్‌ను కూడా ప్రారంభించామని గుర్తు చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, రాబోయే రోజుల్లో తృప్తి క్యాంటీన్ దినదినాభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆలోచన మేరకు రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘ సభ్యుల జీవన ప్రమాణాలు పెంచి వారిని లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగానే కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో తృప్తి క్యాంటీన్‌ను ప్రారంభించామని చెప్పారు. నంద్యాల పట్టణంలోని రూరల్ మరియు అర్బన్ ఎస్‌హెచ్‌జి గ్రూపులకు లైవ్లీహుడ్ కార్యకలాపాలను ప్రోత్సహించడంలో భాగంగా గత వారం అరకు కాఫీ షాప్‌ను ప్రారంభించామని, అది విజయవంతంగా కొనసాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. తృప్తి క్యాంటీన్‌ను ఎస్‌హెచ్‌జి మహిళలు సమర్థవంతంగా నిర్వహించి మంచి లాభాలు సాధించాలని ఆకాంక్షించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి జిల్లాలో పూర్తి స్థాయి సహకారం అందిస్తున్నామని, ఇందులో హార్టికల్చర్ శాఖ ద్వారా 35 శాతం సబ్సిడీతో పాటు మిగిలిన మొత్తానికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మిల్లెట్స్ ప్రాసెసింగ్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని, స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు.

# నంద్యాలలో ప్రజా దర్బార్ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యక్షంగా స్పందించిన గౌరు చరిత రెడ్డి, ఫయాజ్



**నంద్యాల సిటీ బ్యూరో జనవరి 30 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి గారు, రాష్ట్ర నాయకులు చీఎం ఫయాజ్ గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వారు స్వయంగా అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నంద్యాల జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, పార్టీ తరఫున నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# మోదీ నయవంచనకు పుష్కరకాలం

**ఉపాధి హామీ పథకాన్ని పాతరేసేందుకు కేంద్రం కుట్ర**

**నిరుపేదల ఆర్థిక భరోసాపై గొడ్డలి పెట్టు - ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.ఆవుల శేఖర్ ధ్వజం**



**నంద్యాల ప్రతినిధి. జనవరి 30 . (నంది పత్రిక ):** దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ పగ్గాలు చేపట్టిన ఈ 12 ఏళ్ల కాలం.. భారత నిరుపేదల పాలిట నయవంచనకు 'పుష్కరకాలం'గా మారిందని" ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలోని కోట్లాది మంది గ్రామీణ నిరుపేదలకు రాజ్యాంగ బద్ధంగా లభించిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన నిరసించారు. పాత ఉపాధి చట్టాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.బాబా ఫకృద్దీన్ అధ్యక్షతన భారీ 'సామూహిక సత్యాగ్రహ దీక్ష' నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆవుల శేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని పాతరేసేందుకు మోదీ ప్రభుత్వం 12 ఏళ్లుగా కుట్రలు చేస్తూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2005 ఆగస్టు 23న పార్లమెంటు ఆమోదం పొందిన ఈ చట్టాన్ని, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అనంతపురం జిల్లా నార్పల మండలం బండపల్లిలో ప్రారంభించారని, అప్పట్లో వామపక్షాలకు ఉన్న 63 మంది ఎంపీల బలంతో పదవులు కోరకుండా పేదల తిండి కోసం సాధించుకున్న చట్టం ఇదని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా పేదలు ఆర్థికంగా నిలదొక్కుకుంటుంటే, అది గిట్టని భూస్వామ్య, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కొత్తగా 'జిరాంజీ' బిల్లును తెచ్చిందని ఆరోపించారు. "దేశాన్ని మోదీ, అమిత్ షా అమ్ముతుంటే, అంబానీ, అదానీలు కొంటున్నారని" ఎద్దేవా చేశారు. గతంలో కేంద్రం 90 శాతం నిధులు భరించేదని, ఇప్పుడు రాష్ట్రాలపై 40 శాతం భారం వేయడం అంటే పేదలను పథకం నుండి తరిమేయడమేనని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రానికి వత్తాసు పలకడం శోచనీయమని, గతంలో 'నేను ప్రశ్నిస్తాను' అన్న జనసేనాని పవన్ కళ్యాణ్ ఇప్పుడు స్వయంగా గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండి కూడా కేంద్రం చేస్తున్న అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. పేదరికం, నిరుద్యోగం, వలసల వంటి సమస్యలను కేవలం పేర్లు మార్చి ప్రచార ఆర్భాటాలతో పరిష్కరించడం సాధ్యం కాదన్నారు. కూలీలకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని, పనిదినాలను 125 రోజులకు పెంచి రూ. 700 వేతనం అందించాలని డిమాండ్ చేశారు. నేటి నుండి 10 రోజుల పాటు రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమాలు చేపడతామని, కేంద్రం దిగి రాకపోతే అన్ని సంఘాలను ఏకం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి మురళీధర్. ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ రియాజ్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు. ఆర్ సామేలు.ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి హరినాథ్. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు. జి లక్ష్మీదేవి ఏఐటియుసి పట్టణ అధ్యక్షుడు భూముని శ్రీనివాసులు.పట్టణ కార్యదర్శి. డి శ్రీనివాసులు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి రాజు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లక్ష్మయ్య. దస్తగిరి.నాగరాజు వెంకటసుబ్బయ్య వందలాది మంది మహిళ వ్యవసాయ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

# కేరళలో పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించిన టీమిండియా సభ్యులు

న్యూజిలాండ్‌తో జరగనున్న చివరి టీ20 మ్యాచ్‌కు ముందు భారత క్రికెట్ జట్టు సభ్యులు దైవదర్శనం చేసుకున్నారు. తిరువనంతపురంలోని చారిత్రక శ్రీ పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జరగనున్న సిరీస్‌లోని ఆఖరి మ్యాచ్‌కు ముందు వారు స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్-రౌండర్ అక్షర్ పటేల్, బ్యాటర్ రింకు సింగ్, స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి వెళ్లారు. ఈ సిరీస్ ఆరంభం నుంచి భారత ఆటగాళ్లు తరచూ ఆలయాలను సందర్శిస్తున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన నాలుగో మ్యాచ్‌కు ముందు సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న విషయం తెలిసిందే.

ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత్ ఇప్పటికే 3-1 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, బుధవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 50 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో చివరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను ఘనంగా ముగించాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



### ఉద్యోగుల నుంచి 94 దరఖాస్తులు స్వీకరణ

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జనవరి 30(నంది పత్రిక):–** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం నిర్వహించి, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల నుంచి మొత్తం 94 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, అలాగే అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని, వాటన్నింటినీ సమగ్రంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. జిల్లాస్థాయిలో పరిష్కరించవలసిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రాష్ట్రస్థాయిలో పరిష్కరించాల్సిన అంశాలను సంబంధిత శాఖలకు నివేదిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ, వైద్య–ఆరోగ్య, విద్యా శాఖల నుంచి అత్యధికంగా సమస్యలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన వార్షిక ఇంక్రిమెంట్లు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు, మహిళా ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 94 అర్జీలు స్వీకరించినట్లు వివరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కార కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులు ప్యాపిలి మండలం, సీతమ్మతాండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పి. వెంకటేశ్వర్లు తనకు పొజిషన్ ఐడి క్రియేట్ చేయకపోవడం వల్ల ఇప్పటివరకు వేతనం అందలేదని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు. దీనిపై తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్, తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఖజానా అధికారి మరియు ఐటిడిఎ పిఓలను ఆదేశించారు. లిఖినంద్యాల వైద్య కళాశాలలో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపికై పది నెలలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదని, తమ పేర్లను అప్కాస్‌లో నమోదు చేసి వేతనాలు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. లిఖిప్యాపిలి మండలం, పోతుదొడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. చక్రేనాయక్ గతంలో అనంతపురం జిల్లాలో జరిగిన ప్రభోద ఆశ్రమ ఘర్షణ కేసులో అరెస్టై సస్పెన్షన్‌కు గురయ్యానని, ఆ కాలాన్ని అర్ధవేతన సెలవుగా పరిగణించి నిలుపుదల చేసిన ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.



# ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం





**బండి ఆత్మకూరు నంది పత్రిక జనవరి30 :** బండి ఆత్మకూరు లోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విద్య అనేది జ్ఞానం నైపుణ్యాలు విలువలతో పాటు అలవాట్లను అభ్యసించడం ద్వారా వ్యక్తిగత వికాసాన్ని సామాజిక పురోగతిని పెంచే ప్రక్రియ అన్నారు. మానవ మేధస్సును సానబట్టి సమాజానికి అవసరమైన బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేస్తుందని అన్నారు. విద్య అంటే కేవలం పుస్తక జ్ఞానం మాత్రమే కాదని, అంతర్గత జ్ఞానాన్ని వెలికి తీయడం లాంటిది అన్నారు. విద్య అనేది వారసత్వం, సంస్కృతి,విలువలు మరియు భాషను ఒక తరం నుండి మరో తరానికి అందజేస్తుందని అన్నారు. వ్యక్తిగత జీవితాన్ని సన్మార్గంలో పెట్టడానికి సృజనాత్మకతను పెంచడానికి సహాయపడుతుందని అన్నారు. పాఠశాల జీవితం ప్రతి ఒక్కరి వ్యక్తిత్వం పైన ప్రభావం చూపుతుందని పుస్తకాలతో పాటు, క్రీడలు ఇతర విభాగాల్లోనూ సమాన ఆసక్తిని పెంచుకొని ప్రతి అంశంలోనూ నైపుణ్యం సాధించాలని విద్యార్థిని విద్యార్థులకు వక్తలు సూచించారు. విద్యాభ్యాసంతో పాటు క్రమశిక్షణ సేవా భావాన్ని పెంపొందించుకోవడంలో ముందంజలో ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల స్థల దాతలు రాజంరెడ్డి సుజాతమ్మ ఇటీవల చిన్న సుబ్బారెడ్డి, ఎమ్మార్పీఎస్ వెంకటసుబ్బన్న తో పాటు అతిథులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ పద్మావతమ్మ ఎంపీడీవో గాయత్రి వైయస్సార్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రాజంరెడ్డి సుజాతమ్మ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ ముమ్మడి కృష్ణారెడ్డి జాకీర్ ఖాన్ విద్యా కమిటీ చైర్మన్ రమేష్ యాదవ్ చిన్న సుబ్బారెడ్డి అంజాత్ ఖాన్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుర్ రాఫీ కళాశాల సిబ్బందితోపాటు పలువురు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన కు ప్రత్యేక కృషి



### బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

### జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి పి. విజయ

**ఎమ్మిగనూరు నంది పత్రిక....**జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన కు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి పి. విజయ పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బాల్య వివాహ ముక్త భారత్ నవంబర్ 27 నుండి మార్చి 8వ తేదీ వరకు నిర్వర్తిస్తున్న వంద రోజుల ప్రణాళికలో లో భాగంగా డివిజన్ స్థాయిలో శుక్రవారం ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలోని రైతు భరోసా కేంద్రం లో ఎమ్మిగనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలనపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి పి విజయ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం అని తెలిపారు.. బాల్య వివాహాలు జరిపితే, అమ్మాయిని తీసుకువెళ్లి, బాల సదనం లో ఉంచి, 18 ఏళ్లు నిండిన తర్వాతనే తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాలు చేస్తే పెళ్ళి చేసిన తల్లిదండ్రులకే కాదు, పెళ్ళిచూపులకు తీసుకువచ్చిన మధ్యవర్తితో మొదలుకుని పెళ్లి చేసిన పురోహితుడు, ఫంక్షన్ హాల్ ఓనర్, పెళ్లి కార్డులు ముద్రించిన ప్రచురణకర్త , పెళ్లికి వచ్చిన అతిథులు అందరూ కూడా చట్టప్రకారం శిక్షకు అర్హులే అని తెలిపారూ. మండల స్థాయిలో తహసీల్దార్ బాల్య వివాహాల నిరోధక అధికారి గా వ్యవహరిస్తారని, గ్రామస్థాయిలో ఉన్న బాల్య వివాహ నిషేధ అధికారులు పంచాయతీ సెక్రెటరీ, విఆర్ఓ మహిళ పోలీసులు కచ్చితంగా 31 ప్రకారము తమ విధులను నిర్వర్తించాలన్నారు.. గ్రామస్థాయిలో బాలబాలికల తల్లిదండ్రులు చదివించుకోలేని స్థితిలో ఉన్న బాలలకు విద్యా, వసతి, పునరావాసము కల్పించడానికి జిల్లా స్థాయిలో రెండు బాలసదనాలు ఉన్నాయని, ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.డి.ఎస్.పి భార్గవి మాట్లాడుతూ చిన్న వయసులో బాల్య వివాహాలు చేయడము వల్ల బాలికల బంగారు భవిష్యత్తుకు ఆటంకం ఏర్పడుతుంద న్నారు. . ముఖ్యంగా బాల్య వివాహాలు చేయడానికి తల్లి దండ్రులు ప్రయత్నాలు మొదలుపెట్టే క్రమంలోనే ముందుగానే సమాచారం ఇవ్వడం వల్ల వెంటనే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాలు వారు చేయకుండా నిలుపుదల చేయవచ్చని తెలిపారు.. ఈ సమాచారం ముందుగా తెలపడం వల్ల బాలికలను రక్షించడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఈ బాల్య వివాహం వల్ల వచ్చే అనర్థాల, ఇబ్బందులు, ఆ బాలికలు ఎదుర్కొనే శారీరక మరియు మానసిక ఇబ్బందుల గురించి వివరించారు.. చిన్న వయసులో బాల్యవివాహాలు చేస్తే లక్ష రూపాయలు జరిమానాతో పాటు రెండు సంవత్సరాల పాటు



జైలు శిక్ష ఉంటుందని , కావున అమ్మాయికి కచ్చితంగా 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తి కావాలన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు . ఆర్ బి ఎస్ కె డిస్టిక్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడము చాలా చట్ట విరుద్ధమని, తెలిపారు. సమాజంలో ఆడ మగ అనే భేదం లేకుండా చూడాలన్నారు. అనంతరం మహిళా పోలీస్ సిఐ శ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు, మహిళలు గాని తమను తాము రక్షించుకోవాలంటే కచ్చితంగా తమ సెల్ ఫోన్ లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రొటెక్షన్ ఏర్పడుతుందని తెలిపారు ముఖ్యంగా బాలికలు కష్టపడి బాగా చదివి ఉన్నతమైన స్థాయికి ఎదిగినప్పుడు తమ తల్లిదండ్రులతో పాటు సమాజంలో గాని దేశంలో గాని మంచిగా గుర్తింపు పొందడమే కాక ఒక ఆదర్శవంతంగా కూడా నిలబడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులుఎమ్మార్వో ఎంపీడీవో, సిడిపిఓ నర్సరీ నిస్సా బేగం, డి సి పి యు శారద వైఎస్సి సిఏ మేరి స్వర్ణలత మరియు సూపర్వైజర్లు సురేఖ, గురు శేఖరమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత..

### పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)" ఏర్పాటు....



**నంద్యాల క్రైం, జనవరి30(నంది పత్రిక):–** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)" ను నేడు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ నిర్వహించారు. నంద్యాల జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు మరియు విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 10 మంది పోలీస్ సిబ్బంది, హోంగార్డ్స్ వారి యొక్క సమస్యల గురించి ఎస్పీకి తెలియచేసినారు. సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ వాటిపై సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయం అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బంది యొక్క సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకోని పరిష్కరిస్తున్నామన్నారు. విధులలో సిబ్బంది ఇబ్బంది పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియ చేసినారు.

# ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరును కొనసాగించాలి



**వెలుగోడు, జనవరి 30 (నంది పత్రిక):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగించి ఇతరుల పేరును పెట్టడం గాంధీకి అవమానకరమని, వెంటనే తిరిగి గాంధీ పేరును కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు.మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వెలుగోడు పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధుని తర్వాత సత్యం, అహింస మార్గాలను ప్రపంచానికి చూపిన మహానేత బాపూజీ అని కొనియాడారు. సత్యాగ్రహాన్ని ఆయుధంగా చేసుకొని బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించారని గుర్తు చేశారు.గాంధీజీ ఒక సాధారణ మనిషి అయినప్పటికీ, ఆయన చిత్తశుద్ధి, సిద్ధాంత నిబద్ధత అనన్యసాధారణమని పేర్కొన్నారు. నేటి రాజకీయాల్లో కులమతాల ప్రాధాన్యత పెరుగుతున్న పరిస్థితి బాధాకరమని. తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ చరిత్రలో అరుదైన స్థానం సంపాదించుకున్న మహోన్నత వ్యక్తి గాంధీజీ అన్నారు.1916లో అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమాన్ని స్థాపించి సత్యం, అహింస మార్గాలను తన అనుచరులకు బోధించారని, 1918లో రైతులపై విధించిన పన్నులకు వ్యతిరేకంగా చేపట్టారు. సత్యాగ్రహంతో ప్రభుత్వం పన్నులు రద్దు చేసిందని గుర్తు చేశారు. ఐక్యరాజ్య సమితి గాంధీజీ జన్మదినాన్ని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించడం భారతీయులందరికీ గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో సంజీవరాయ ప్రసాద్, మెడికల్ స్టోర్ రాము, మీసేవ నాగరాజు, ఆయిల్ స్టోర్ శ్రీనివాసులు, సురేష్, కుమార్, బాషా ఉన్నారు. అలాగే ఎస్డిపిఐ నాయకులు శ్రీశైలం నియోజకవర్గ అసెంబ్లీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, తాహిర్, రహంతుల్లా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి ఆయన సేవను కొనియాడారు.

# ప్రభుత్వ పథకాలపై ప్రజా అభిప్రాయాన్ని మెరుగుపర్చాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, జనవరి 30(నంది పత్రిక):–** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవల పట్ల ప్రజల అభిప్రాయాన్ని మరింత మెరుగుపర్చేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కార కార్యక్రమం అనంతరం, పబ్లిక్ పర్సెప్షన్ అంశంపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల ప్రజాభిప్రాయాన్ని ఐవిఆర్ఎస్, క్యూఆర్ కోడ్, వాట్సాప్ గవర్నర్స్ వంటి వివిధ మాధ్యమాల ద్వారా సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 38 శాఖల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజాభిప్రాయం సేకరణ జరుగుతుండగా, అందిన అభిప్రాయాల ఆధారంగా సంబంధిత అధికారులకు ర్యాంకింగ్ కూడా ఇస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఓపిటిఎస్ ద్వారా అధికారుల పనితీరును నిరంతరం ట్రాకింగ్ చేయడం జరుగుతుందని, ఇందులో హాజరు శాతం, ఈ–ఆఫీస్ ఫైల్ నిర్వహణ, కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్, ఐజిఓటి కోర్సుల పూర్తి తదితర అంశాల ఆధారంగా జిల్లా అధికారుల పురోగతిని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి అధికారి తమ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, సేవల ప్రస్తుత స్థితిని సమీక్షించి, వాటి పనితీరు శాతాన్ని పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో అన్న క్యాంటీన్లు, సంక్షేమ వసతి గృహాలు, రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖల ద్వారా అందిస్తున్న కొన్ని సేవల్లో తక్కువ శాతం నమోదు కావడం గమనించామని, దీనిపై తక్షణమే దృష్టి సారించి మెరుగుదల చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌కు సంబంధించి రియల్ టైమ్ గవర్నర్స్ వెబ్‌సైట్‌ను జిల్లా కలెక్టర్ ఓపెన్ చేసి, జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల పనితీరు శాతాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సవివరంగా వివరించారు. ఈపిటిఎస్ (ఎలక్ట్రానిక్ పనితీరు మరియు ట్రాకింగ్ సిస్టం)కు సంబంధించిన అంశాల్లో మరింత పురోగతి సాధించాలని, సంబంధిత డాక్యుమెంట్లను కూడా నిర్దేశిత గడువులోగా అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆంధ్రఅక్షర కార్యక్రమం ద్వారా మహిళలను విద్యావంతులను చేసే దిశగా మరింత వేగం పెంచాలని సూచించారు. వాట్సాప్ గవర్నర్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై విస్తృత అవగాహన కల్పించి, ప్రజలు ఆ సేవలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

# రాయలసీమ యూనివర్సిటీలో నూతన కోర్సులను ప్రవేశపెట్టాలి.

### ప్రైవేట్ కళాశాలల్లో విద్యను అభ్యసించడం విద్యార్థులకు ఆర్థిక భారం.

### వర్సిటీ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ పరిధిని పెంచి,సిబ్బందిని నియమించాలి.

### ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్

**కర్నూలు నంది పత్రిక.....**రాయలసీమ యూనివర్సిటీ లో నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ అన్నారు.శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శరత్ కుమార్ మాట్లాడుతూ రాయలసీమ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సులు వర్సిటీలో లేకపోవడమే ప్రధాన కారణమని అన్నారు.ప్రస్తుతం లా,ఎం.ఎ.(జర్నలిజం),ఎంఈడీ కోర్సులు రాయలసీమ యూనివర్సిటీలో వేలాది రూపాయలు వెచ్చించి, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్నారని, తద్వారా విద్యార్థులకు అదనంగా ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి, సామాన్య కుటుంబాల విద్యార్థులకు లా,జర్నలిజం కోర్సులు కల గానే మిగిలిపోతున్నాయని అన్నారు. అంతేకాకుండా లా,జర్నలిజం, కోర్సులు లేకపోవడంతో ఇతర జిల్లాలోని యూనివర్సిటీలలో అడ్మిషన్లు పొందడం జరుగుతుందని అన్నారు. గతంలో యూనివర్సిటీలోనే ఎంఈడీ కోర్సు ఉండేదని, కాలక్రమేణా నిర్వహణ లోపంతో మూసి వేయడం జరిగిందని ఆరోపించారు. అదేవిధంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో నైపుణ్యత లేక అనేక అవకాశాలకు దూరమవుతున్నారని అన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీలో ఉన్న స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ పరిధిని కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా, దాని పరిధిని విస్తరించి, సిబ్బందిని నియమించాలని ఆయన వీసీని కోరారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ నాయకులు ఆలీ, రాజు,హరీష్,నాగేంద్ర, సురేంద్ర తదితరులు ఉన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గాంధీ వర్ధంతి

**బండి ఆత్మకూరు నంది పత్రిక జనవరి 30:** బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి భావన రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆయుష్ వైద్యాధికారి నాగరాజు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీజీ కుష్టు వ్యాధి గ్రస్తులకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై గ్రామాలలో అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి భావనా రెడ్డి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కస్తూరిబా పాఠశాలతో పాటు బండి ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కూడా ఎంపీడీవో గాయత్రి తో పాటు డిప్యూటీ ఎంపీడీవోలు అన్నం పురుషోత్తం, చంద్రమౌళి,ఏపీవో వసుధ రెడ్డి, ఏవో శ్యామల,సిబ్బంది గాంధీజీ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు.



# ప్రజల మానసిక ఉల్లాసానికి ఉద్యానవనాల అభివృద్ధి







## వీనస్ కాలనీ పార్కు అభివృద్ధికి మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన

**నాణ్యతతో వేగంగా పనులు పూర్తి చేయాలి**

**ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

కర్నూలు నంది పత్రిక..... నగర ప్రజల మానసిక ఉల్లాసం, ఆహ్లాదకర వాతావరణం కోసం ఉద్యానవనాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవార నగరంలోని వీనస్ కాలనీ పార్కులో రూ.45 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణం, థెరప్యూటిక్ గార్డెన్ (పంచతత్వ నడక మార్గం), నడకబాట, గ్రీనరి ఏర్పాటు, 168 అడుగుల జాతీయ జెండా నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెరుగుతున్న నగరీకరణ నేపథ్యంలో ప్రజలకు ప్రశాంతత, ఆరోగ్యకర జీవనశైలి అందించడంలో ఉద్యానవనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. వృద్ధులు, మహిళలు, పిల్లలు నిత్యం వినియోగించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలతో పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా నగరంలో పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని అన్నారు. నగరంలో రూ.25.25 కోట్ల సాధారణ, రూ.4.16 కోట్ల 15వ ఆర్థిక సంఘం, రూ.40 లక్షలు 'కూడా' నిధులతో అభివృద్ధి పనులను చురుగ్గా జరుగుతున్నాయని, అలాగే త్వరలో కర్నూలు నియోజకవర్గ పరిధిలో కొత్తగా 6 పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన సూచనలు చేశారు. అలాగే లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్‌యస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బిపియస్) పథకాల ద్వారా అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ పథకాల ద్వారా ప్రజలు తమ ఆస్తులకు చట్టబద్ధత సాధించడంతో పాటు నగరాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూరుతాయని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎల్ఆర్‌యస్, బిపియస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ క్రిష్ణలత, టిపిఈలు పవన్, రాజేష్, బి.ఉదయ్, శానిటేషన్ ఇంస్పెక్టర్ మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అపోహలు వీడదాం కుష్టును తరిమికొడదాం

**మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా**

**స్పర్శ లెప్రోసి అవగాహన కార్యక్రమం**



బద్వేల్ జనవరి 30 (నంది పత్రిక)అపోహలు వీడదాం కుష్టును తరిమికొడదాం అనే నినాదంతో (30-01-2026) న బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజుపాలెం గ్రామ పంచాయతీలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ లెప్రోసి అవగాహన కార్యక్రమం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి మల్లీశ్వరి హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ జె. రాజేష్ కుమార్, డాక్టర్ జై. వినయ్ కుమార్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు బి. శంభు ప్రసాద్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చంద్రావతి, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాధా, ఏఎన్ఎం శాంతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు, ఒకరి నుంచి మరొకరికి వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుందో ప్రజలకు వివరించారు. స్పర్శ లేని మచ్చలు కనిపించిన వెంటనే గుర్తించి సకాలంలో సరైన వైద్యం తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ప్రజలు అపోహలను వీడి అవగాహన పెంచుకోవాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారి మల్లీశ్వరి మాట్లాడుతూ అంగవైకల్యం రాకుండా ముందుగానే లక్షణాలను గుర్తించి, వెంటనే వైద్య సేవలు పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ఎస్ రంగాపురం లో ఆగిన హజరత్ శ్రీ శ్రీ శ్రీ సయ్యద్ షా అల్లా బకష్ ఖాద్రి దర్గా ఉరుసు ఉత్సవములు.

**పగిలిన కిస్తీ తొట్టిని యధావిధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.**

**కిస్తీ పగలగొట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలి.**

**గ్రామ ప్రజలు మరియు గ్రామ పెద్దలు.**



బేతంచెర్ల జనవరి 30 ( నందిపత్రిక ) నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామములో పురాతన కాలం నుండి హాజరత్ శ్రీ శ్రీ శ్రీ సయ్యద్ షా అల్లా బకష్ ఖాద్రి దర్గా ఉరుసు ప్రతి సంవత్సరం ఆర్ ఎస్.రంగాపురం గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు ముస్లిమ్ సోదరులు ఐకమత్యం తో ఊరుసును నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నెల 30, 31 వ తేదీలు మరియు ఫిబ్రవరి 1 వతేది, ఈమూడు రోజులు దర్గాను రంగు రంగుల విధ్యుత్ దీపాలతో అలంకరించి,గ్రామ ప్రజలు బంధు, మిత్రులతో, చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాల ప్రజలు కలిసి, కుల మతాలకు అతీతంగా, సామారస్యంతో ఉరుసు కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో,సాంస్కృతిక కార్యక్రమా లతో,ఆటపాటలతో,క్రీడలతో, వృషభ రాజముల బండ లాగుడు పందెంలతో సంతోష సంబరాలతో నిర్వహించే ఉరుసును, అని వార్య కారణాల వల్ల నిలుపుదల చేయడమైనది. ఈ గురువారం నుండి ఉరుసు ఉత్సవాలు మొదలయ్యేవి. కిస్తీ పగల గొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని, దర్గా ముందు గ్రామ ప్రజలు రోడ్డుపై కూర్చొని, శుక్రవారం నిరసన చేపట్టారు.గతంలో కూడా నిరసన రూపంలో ప్రభుత్వానికి తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని,యధావిధిగా ఉరుసు కార్యక్రమాలు జరిగేటట్లు తగు చర్యలు చేపట్ట వలయునని గ్రామ పెద్దలు, ప్రజలు కోరుతున్నారు.

# రెవెన్యూ శాఖ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరగాలి.

**సర్వే కు డబ్బులు తీసుకో రాదు**

**అర్జీల ను త్వరగా పరిష్కరించాలి , రైతులతో మర్యాదగా వ్యవహరించాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**





కర్నూలు, నంది పత్రిక.....జిల్లాలో రెవెన్యూ శాఖ పని తీరుపై ప్రజల్లో పాజిటివ్ పర్సెప్షన్ రావాలంటే ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీ సర్వే, ఎఫ్ - లైన్, ఐవిఆర్ఎస్ కాల్స్,పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ మెదలకు రెవెన్యూ అంశాలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ..ఎఫ్‌లైన్‌లో ఉన్న అన్ని అర్జీలను వేగవం తంగా, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని , అర్జీదారులకు అనవసరంగా ఆలస్యం జరగకుండా చూడాలని , రైతుల భూములకు సంబంధించిన పనుల విషయంలో ముందస్తు నోటీస్ ఇచ్చిన తరువాతే ఫీల్డ్ లోకి వెళ్లాలని , రైతుల హక్కులు , గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని తెలిపారు. రైతులతో ఎప్పుడూ మర్యాద పూర్వకంగా, గౌరవంతో వ్యవహరించాలన్నారు. విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు ప్రతి రోజు తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని , గ్రామంలో హాజరు నమోదు చేసిన తర్వాతనే ఫీల్డ్ కి వెళ్లాలని ఆదేశించారు. అలాగే తమ విధుల పురోగతిపై ప్రతి రోజు సంబంధిత తహశీల్దార్‌కు రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. హాజరు మరియు రిపోర్టింగ్‌లో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని, చిన్న పొరపాట్లు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీయవచ్చని కలెక్టర్ సూచించారు. రీ సర్వే కి చేయడానికి డబ్బులు అడగకూడదని, ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా రెవెన్యూ శాఖ సిబ్బంది సమన్వయంతో, బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... రైతు - ప్రభుత్వం మధ్య ఉన్న సమస్యను డెస్కటాప్ ద్వారా పరిష్కరించాలని , రైతుల పొలాల దగ్గర సమస్యను ప్రభుత్వ సర్కులర్లు మరియు ఆదేశాలను పాటిస్తూ స్పీకింగ్ ఆర్డర్స్ను ఇవ్వాలని వారికి విషయాన్ని వివరంగా తెలియజేసి సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకోవాలని , విస్తీర్ణం లో తేడాలు వచ్చినప్పుడు తప్పనిసరిగా వారి దగ్గర ఉన్న రికార్డులను పరిశీలించి ఎండార్స్మెంట్ ఇచ్చి వారు సంతృప్తి చెందేలాగా వివరిం చాలని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం లో ఆర్డిఓ అజయ్ కుమార్ , తహసిల్దార్ శేషఫణి , డిప్యూటీ తాసిల్దారులు , సర్వేయర్లు , విఆర్వోలు మొదలగు వారు పాల్గొన్నారు.

# ప్రభాత్ కళాశాలలో మహిళల భద్రత పై అవగాహన



బండి ఆత్మకూరు నంది పత్రిక జనవరి 30 : బండి ఆత్మకూరు మండల పరిధిలోని పార్లపల్లె గ్రామానికి సమీపంలో ఉన్న ప్రభాత్ కళాశాల విద్యార్థినిలకు ఎస్ఐ జగన్మోహన్ మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. శుక్రవారం సాయంత్రం కళాశాలకు సంబంధించి హాస్టలు విద్యార్థినులతో భద్రత విషయంపై ఎస్సై జగన్మోహన్ మహిళా పోలీసులతో కళాశాలకు చేరుకొని హాస్టల్ విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి మహిళలకు వివరించారు. కళాశాల చుట్టూ కాంపౌండ్ ఏర్పాటు చేసుకోవడం వల్ల మహిళల భద్రతకు రక్షణ కవచముల ఉపయోగపడుతుందని ఎస్ఐ వివరించారు.

# ప్రకృతి వైపరీత్యాల వల్ల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్**



నంద్యాల బ్యూరో, జనవరి 30(నంది పత్రిక): ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక - నివారణ ముందస్తు జాగ్రత్త చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో విపత్తు వైపరీత్యాలు సంభవించినప్పుడు కలిగే నష్టాలను నివారించడానికి జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక ఏర్పాటుకు సంబంధిత శాఖలు నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలు తదితర విపత్తుల నుండి సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన అంశాలపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అందజేయాలన్నారు. జిల్లాలోఆటోమేటెడ్ వాతావరణ కేంద్రాలపై ఎప్పటికపుడు తనిఖీ చేసి అవి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సిపిఓ ను ఆదేశించారు. హార్టికల్చర్ కు సంబంధించి బండ్ ప్లాంటేషన్ పై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. మత్స్య శాఖకు సంబంధించి ఎంఐ ట్యాంకుల్లో ఫిషింగ్ చేస్తున్నారని సదరు ఎంఐ ట్యాంకులను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు నిర్మిస్తున్న నీటి తొట్లను నాణ్యతతో నిర్మించాలని అందులో నిత్యం పశువులకు నీరు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విపత్తుల వల్ల విద్యుత్ కు సంబంధించి హెవీ వోల్టేజ్ వచ్చినప్పుడు తక్షణ చర్యలు తీసుకునేటట్లు చూడాలన్నారు. ఆర్వబ్ల్యూఎస్ కు సంబంధించి నీటి సమస్య తలెత్తకుండా సరైనా సమయంలో చర్యలు తీసుకో వాలన్నారు. మండల స్థాయిలో త్రాగు నీటి ఇబ్బంది లేకుండా ఆర్డీఓలు చర్యలు చర్యలు తీసుకుని ట్యాంకులు ఎప్పటికపుడు పూర్తి స్థాయిలో నింపుతూ క్లీన్ చేయాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు అంశాల గురించి జాయింట్ కలెక్టర్ కులం కూషంగా వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు.

# ప్రభుత్వం వార్షిక బడ్జెట్ కేటాయించాలి

**మాదిగ ఉపకులాల మహాధర్నా**



కర్నూలు నంది పత్రిక...... శుక్రవారం ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా నాయకులు బైరాపురం రాజు ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో గత ఏడు సంవత్సరాలుగా దళితుల అభివృద్ధికి నోచుకోలేదు 2026- 27 సంవత్సరంలో జరిగే బడ్జెట్ సమావేశాలలో మాదిగ, మాల, రెల్లి కులాల కార్పొరేషన్లకు ఏబీసీ గ్రూపుల వారీగా ప్రభుత్వం వార్షిక బడ్జెట్ కేటాయించాలి. అలాగే కుటుంబ యజమానిని కోల్పోయిన మహిళలకు రెండవ నెల నుండి ప్రభుత్వం పింఛను 6000 రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్టం లోని ఎస్సీ ఎస్టీ కేసులలోని బాధిత కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని 20 లక్షల నుండి కోటి రూపాయలకు పెంచాలి. మరియు మాదిగ చర్మ డప్పు కళాకారుల పెన్షన్ 6000 రూపాయలకు పెంచి హోల్డ్ లో ఉన్న దరఖాస్తులు తొలగించి కొత్త పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరించాలి అని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అసైన్డ్, భూదాన బోర్డు,ల్యాండ్ సీలింగ్,్ఎణజ, వివిధ రకాల భూములను దళిత గిరిజన పేదలకు అసైన్మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేసి భూమిలేని నిరుపేదలైన దళిత గిరిజనులకు ఇచ్చిన భూములకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ అన్నారు ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయ మాదిగ, బైరాపురం రాజు, మీసాల బాబు, రెడ్డి పోగు రాజశేఖర్, దాస్, మహిళా నాయకురాలు సుజాత, అయ్యమ్మ, పుష్పావతి, రేణుక తదితరులు పాల్గొన్నారు

# బాంబు బెదిరింపుతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో 180 మంది ప్రయాణికులతో సహా మొత్తం 186 మంది ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విమానం గాల్లో ఉండగా, ఓ టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. విమానాన్ని హైజాక్ చేస్తామని, బాంబు ఉందని ఆ నోట్‌లో ఉండటంతో పైలట్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఏవియేషన్ భద్రతా నిబంధనల ప్రకారం, పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.

# డీజిటల్ లావాదేవిలపై అవగాహన



కొత్తపల్లి - నంది పత్రిక : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డు సంస్థ తరుపున శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై, డీజిటల్ లావాదేవిలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవిలు. బ్యాంకుల నుంచి రుణాలు ఏలా పొందాలి, అదేవిధంగా ఆన్లైన్ మోసాలపై విద్యార్థులకు కళాజాత బృందం అవగాహన కల్పించారు. బ్యాంకు ఓటీపీ ఫ్రాడ్స్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ ప్రశాంతి, మేసింజర్ మహెబూబ్ బాషా, కళాజాత బృందం, ఉపాధ్యాయ బృందం ఉన్నారు..

# హని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమమునకు గ్యాస్ సిలిండర్ ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగింది

**హని వర్షారెడ్డి**



కర్నూలు నంది పత్రిక...... శుక్రవారం నందికొట్కూర్ పట్టణమునందు మారుతి నగర్ లో గల వృద్ధాశ్రమమునకు హని ఫౌండేషన్ తరపున గ్యాస్ సిలిండర్ మరియు ఫ్రూట్స్ పంపిణీ చేయడం జరిగింది మా వంతు సహాయంగా హని ఫౌండేషన్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు ముందుండాలని చైర్మన్ హని వర్ష రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో మహేష్,, రాజు, సూరి, కళ్యాణి వినయ్,తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

**కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ .**

**నిర్లక్ష్యం వహించకండి.**

**ప్రజల్లో మార్పు రావాలి.**

**పోలీసులు ప్రతి రోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు....సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మరి మంచిది.**

**కర్నూలు నంది పత్రిక......** రోజురోజుకూ బంగారం ధరలు గణనీయంగా పెరగడంతో దొంగతనాలకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా గృహాల్లో బంగారం, విలువైన ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలని లేదంటే బ్యాంకు లాకర్లలో ఉంచుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. ఇటీవల చోటుచేసుకుంటున్న దొంగతనాల నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల భద్రతా చర్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇళ్లలో బంగారు నగలు, నగదు వంటి విలువైన వస్తువులను నిల్వ ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచాలని , ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను ముందుగానే అరికట్టవచ్చన్నారు. అపరిచిత వ్యక్తులు బంగారం కు మెరుగులు దిద్దుతాం అంటూ ఇళ్లలోకి వచ్చే ప్రయత్నం చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వివాహాలు, శుభకార్యాల సమయంలో బంగారం ఆభరణాలు ధరించినప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుంపులుగా ఉండే ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్ వంటివి జరిగే అవకాశం ఉంటుందని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పట్టణ, గ్రామ శివారులలో ఉన్న ఇళ్ళను, ఒంటరి వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుంటూ టార్గెట్గా రెక్కీ చేస్తూ, చైన్ స్నాచింగ్లు, ఇళ్లల్లో చోరీలు చేసి, నంబర్ ప్లేట్లులేని బైకులతో వచ్చి బంగారు ఆభరణాలను ఎత్తు కెళ్తున్నారన్నారు.

ఉత్సవాలు, జాతరలకు ఎట్టి పరిస్థితుల్లో నూ బంగారు నగలు వేసుకొని వెళ్లకండా ఉండడం ఉత్తమమన్నారు.అపార్ట్ మెంట్లు , ఇళ్ళ వద్ద భద్రత కు జజుం, అలారాలు ఉంచుకోవడం ఉత్తమమన్నారు. ఒంటరిగా నడిచేటప్పుడు లేదా ప్రయాణాల్లో జాగ్రత్త వహించాలన్నారు. అత్యంత విలువైన ఆభరణాలను ఇంట్లో కాకుండా బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలన్నారు. ఏదైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనాల ప్రయత్నాలు గమనించినా వెంటనే



డయల్ 100 / డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ తెలిపారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమవుతుందని, అప్రమత్తతే భద్రతకు మూలమని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ గారు ఈ సందర్భంగా తెలియజేశారు.

# విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

**రెండు దఫాలుగా వైర్లు చోరీ చేసిన దొంగలు**

**పంట పండించుకోలేమంటూ ఆందోళన చెందుతున్న రైతులు**

**దొర్నిపాడు జనవరి 30నందిపత్రిక** మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో కుందూ నది వెంబడి పొలాలు సాగు చేసుకుంటున్న రైతుల విద్యుత్ మోటార్ల త్రీఫేస్ వైర్లను గుర్తుతెలియని దుండగులు కట్ చేసుకుని తీసుకుపోతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. గత నెలలోనే దొంగలు వైర్లను కట్ చేసి తీసుకుపోగా కొత్త వైర్లు తెచ్చి రైతులు బిగించుకున్నారు అయితే బుధవారం మరల వైర్లను కట్ చేసి తీసుకుపోవడంతో రైతులు పంట కాలంలో నీరు పెట్టుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు విభూది రెడ్డి, లక్ష్మి రెడ్డి, మొలక వెంగల్ రెడ్డి మిగతా రైతులు వాపోతున్నారు. బుధవారం రోజు పది మంది రైతుల వైర్లను కట్ చేసుకో పోయారు.

**గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశాము.. రైతు రమేష్ రెడ్డి** గత డిసెంబర్ నెలలో విద్యుత్ మోటార్ల వైరు కోసుకుపోయినప్పుడు రైతులము పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేశామని, ఈ పరిస్థితుల్లో వరి పంటను సాగు చేసుకునేందుకు మరలా వైర్లు తెచ్చి బిగించుకోగా ఇప్పుడు మరలా అదేపనిగా వైర్లు కోసి తీసుకుపోయారని వాపోయారు.దీనిపై పోలీసులు గట్టి చర్యలు తీసుకొని దొంగలు ఇటువైపు రాకుండా రైతులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## జంబులాపరమేశ్వరి అమ్మవారి 13వ వార్షికోత్సవం సందర్భంగా ఎద్దుల బండ లాగు పోటీలు.

**రుద్రవరం ప్రతినిధి జనవరి 30 (నంది పత్రిక):** రుద్రవరం గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీ జంబులా పరమేశ్వరి అమ్మవారి 13వ వార్షికోత్సవ మహోత్సవం ఫిబ్రవరి 1, 2026 ఆదివారం రోజున జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉద యం 7 గంటల నుండి అమ్మ వారికి పంచామృత అభిషేకాలు మరియు ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయి, అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించబడే వృషభరాజముల బండలాగుడు పందెములు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి, ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా ₹25,000 నుండి ఆరో బహుమతి ₹4,000 వరకు నగదు పురస్కారాలను దాతల సహకారంతో అందజేయనున్నారు. ఆధ్యాత్మికతతో పాటు వినోదాన్ని పంచేందుకు పట్టాభిరామ కోలాట బృందం చే కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు తెలిపారు.



# నెయ్యిలో కొవ్వులేదని తేటతెల్లం అయింది.



**-వైఎస్సార్సీపీ నాయకులు**

**-వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొట్టిన నాయకులు**

**-బాబు, పవన్కల్యాణ్లు భక్తులకు క్షమాపణలు చెప్పాలి**

**-ఆలయాల మెట్లు ఇప్పుడు శుభ్రం చేయాలి.**

**-వైఎస్సార్సీపీ శ్రేణుల మండిపాటు**

**ఆత్మకూరు జనవరి 30నంది పత్రిక :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కలియుగ వైకుంఠంలో వెలసి ఉన్న దేవదేవుడైన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి అపవాదు వచ్చేలా ప్రఖ్యాతి చెందిన లడ్డు ప్రసాదంలో వైఎస్సార్సీపీ పాలనలో లడ్డు తయారిలో జంతువుల కొవ్వు కలిపారని చేసిన ఆరోపణలు అసత్యమేనని సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లో తేటతెల్లం అయిందని వైఎస్సార్సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి సూచనలతో శుక్రవారం రాత్రి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో సుప్రీంకోర్టు నియమించిన సిట్ ఛార్జీషీట్ను స్వాగతిస్తూ ధ్వజస్తంభం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టారు. కూటమి పాలనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ఆలయం వెలుపల పార్టీ నాయకులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్రెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర విభాగం కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, ఏఎస్పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి, న్యాయవాదుల విభాగం జిల్లా అధ్యక్షుడు నందా ఓబులేసులు విలేకర్లతో మాట్లాడారు. పవిత్రమైన తిరుమల లడ్డు ప్రసాదం తయారు చేసే నెయ్యిలో కల్తీ జరిగిందని 2024 సెప్టెంబరు నెలలో సాక్ష్యాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్లు వెంకటేశ్వర స్వామికి అపవాదు వచ్చేలా ప్రచారం చేయడం క్షమించరాని నేరమన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన వారు ఇప్పుడు సిట్ ఛార్జీషీట్ను చూసి ఏమి సమాధానం చెబుతారని వైఎస్సార్సీపీ నాయకులు ప్రశ్నించారు.

తప్పు చేసిన వారిని ఆ దేవదేవుడు తప్పక శిక్షిస్తారని వారు అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నిందారోపణలు చేయడం కూటమి నాయకులకు అలవాటేనని, ఇప్పటికైనా వారు ప్రాయచిత్తం చేసుకోవాలన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకొనే చంద్రబాబు ఇలాంటి



కుటిలరాజ కీయాలు చేస్తారని తెలిసి ప్రజలు నివ్వెరపోతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు క్షమాపణలు చెప్పాలని, అపవాదులు మానుకోవాలని హితవుపలికారు.

సనాతన ధర్మానికి ప్రతినిధిని అని చెప్పుకొనే పవన్ కల్యాణ్ అదే సనాతన ధర్మానికి అపవాదం వచ్చేలా ఆరోపణలు చేశారని, నిజాలు తెలిశాక ఇప్పటికైనా వెంకటేశ్వర స్వామి అలిపిరి మెట్లు శుభ్రం చేయాలని వారు పేర్కొన్నారు. మరోసారి ఆరోపణలు చేయకుండా వారిద్దరు ఫినాయిల్ తో నోరు శుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనందెడ్డి, పీఆర్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి వెంకట రమేష్ రెడ్డి, షేక్ రహీం, ఎన్ఆర్ మీరామొహిద్దీన్, తోడేటి మణి, అశోక్, కొప్పోలు వెంకటేశ్వర్లు, నందవరం ప్రతాప్, ప్రసాద్, కలాం, ఎన్ఆర్ఏ విష్ణువర్ధన్రెడ్డి, బాలచెన్నయ్య, గడ్డం శ్రీనివాసులు రెడ్డి,

## మహిళా భద్రత‘ రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్ పై అవగాహన.



**వెలుగోడు జనవరి 30 నంది పత్రిక:** మహిళా భద్రత‘ సైబర్ క్రైమ్, ఈవ్ టీజింగ్ , రహదారి ప్రమాదాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం మొదలగు వాటిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు వెలుగోడు మండలం లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సి. ఐ సురేష్ కుమార్ రెడ్డి , ఎస్. ఐ సురేష్ మాట్లాడుతూ సమాజంలో మహిళల భద్రత, మరియు పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత గురించి వివరిస్తూ బాలికలు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపుల పట్ల జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో వివరించారు.అలాగే సైబర్ క్రైమ్, సోషల్ మీడియా దుర్వినియోగం, రోడ్డు ప్రమాదాలు మరియు ఆన్లైన్ భద్రత విషయాలపై వారికి విస్తృతమైన అవగాహన కల్పించారు. మొబైల్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే ప్రమాదాలను గుర్తించటం, అనుమానాస్పద లింకులు లేదా అనుచిత సందేశాలు వచ్చినప్పుడు వెంటనే పోలీస్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. చిన్న వయస్సులో జరిగే బాల్యవివాహాల వల్ల కలిగే మానసిక, శారీరక, సామాజిక నష్టాలపై ఉదాహరణలతో వివరించడం జరిగింది. బాలికలు తమ విద్యను పూర్తి చేసుకుని స్వతంత్రంగా ఎదగడం ఎంత ముఖ్యమో వారికి స్పష్టంగా వివరించారు.పోలీస్ అధికారులు సూచించిన రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాటిని ఉల్లంఘించి రోడ్డు ప్రమాదాలకు గురై జీవితం అంధకారం చేసుకోకూడదని అవగాహన కల్పించారు. పోలీస్ విభాగం తరపున మహిళలకు ఎప్పుడు, ఎక్కడ అవసరం అయినా రక్షణ అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్లైన్ నంబర్ల గురించి విద్యార్థులకు వివరించారు.చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణమహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 193, మాదకద్రవ్యాల దుర్వినియోగారికి సంబంధించి 1972, పై నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చు.

## ఎస్సి కాలనీలో నూతన విద్యుత్ మోటార్ ఏర్పాటు: ఈఓ అశ్విన్ కుమార్



**శిరివెళ్ల : (నంది పత్రిక)** మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీలో గల ఎస్సీ కాలనీ మద్దికుంట వాగు వెళ్లే రాస్తా సమీపంలో ఉన్నటువంటి విద్యుత్ మోటార్ శిథిలావస్థకు చేరి మరమ్మత్తులకు గురి కావడంతో నీటి సమస్య తలెత్తినట్లు ఎస్సీ కాలనీ ప్రజలు పేర్కొన్నారు. నీటి ఎద్దడి సమాచారం తెలుసుకున్న ఈఓ అశ్విన్ కుమార్ వెంటనే స్పందించి మరమ్మతులకు గురై శిథిలావస్థకు చేరిన విద్యుత్ మోటార్ ను వెలికి తీసి 7.5 హెచ్ పి పవర్ నూతన మోటార్ ను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఎస్సి కాలనీ ప్రజలకు నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంకు సైతం అందుబాటులో ఉన్నదని తెలిపారు. మరమ్మత్తులకు గురైన విద్యుత్ మోటార్ వెలికి తీయడానికి మెకానిక్ లకు అసౌకర్యంగా మారడంతో ట్రాక్టర్ యంత్రం ద్వారా వెలికి తీసి నూతన మోటార్ ను అమర్చామన్నారు. నీటి సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ కృషి చేయడం వల్ల కాలనీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

## చాగలమర్రి లో గాంధీ వర్ధంతి వేడుకలు..

**నంది పత్రిక / చాగలమర్రి న్యూస్ ;** చాగలమర్రిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలు“ ఘనంగా నిర్వహించారు. జనవరి 30 గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ సెంటర్ వద్ద మన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. తదుపరి ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకొని చిరస్మరణీయం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ , ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు, ప్రధాన కార్యదర్శి కూరపాటి రామకృష్ణ వరప్రసాద్ , అమరావతి ప్రకాష్ బాబు , తలుపుల కుమార్ , బచ్చు శ్రీనివాసులు , తొమ్మండ్రు నాగేంద్ర గుప్తా ,శ్రీ వాసవి యువజన సంఘం అధ్యక్షుడు తొమ్మండ్రు వినోద్ కుమార్ , కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.




## తిరుమల లడ్డు పై విష ప్రచారం చేసిన వారి కుట్రలు బట్టబయలు.. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె జనవరి 31 నంది పత్రిక** దేవదేవుడైన శ్రీ తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రసాదం పై విష ప్రచారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల విష ప్రచారము సిబిఐ ఇచ్చిన నివేదికతో బట్టబయలైందని వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేసిన వారు హిందూ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాటసాని రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఆంజనేయ స్వామి గుడిలో ఆయన కొబ్బరికాయలను కొట్టి కూటమి నాయకులు చేసిన విష ప్రచారాన్ని ఖండిస్తూ దేవుడే వారిని క్షమించాలని దేవుని వేడుకున్నారు.ప్రపంచవ్యాప్త హిందూ భక్తుల మనోభావాలకు భంగం కలిగించే విధంగా కూటమి ప్రభుత్వం తిరుమల లడ్డుపై విష ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ దేవుని వేడుకున్నారు కార్యక్రమం లో వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కలియుగ దైవం దేవదేవుడు అయిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం పై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తెలుగుదేశం పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు దుష్ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసిన కూటమి ప్రభుత్వం కుటల రాజకీయాలకు దేవుళ్లను కూడా విడిచిపెట్టని కూటమి ప్రభుత్వం శ్రీవారి ప్రసాదం లడ్డులో జంతు కొవ్వు కలిసిందంటూ దుష్ప్రచారం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలికిన ఎల్లో మీడియా కు ఎటువంటి కల్తీ జరగలేదని కోర్టుకు తెలిపిన సిబిఐ వాంగ్మూలంతో బుద్ధి రావాలన్నారు సిబిఐ ఇచ్చిన నివేదికతో కూటమి ప్రభుత్వం కుట్రలన్నీ భగ్నం అయ్యాయని పేర్కొన్నారు.



## 2026- 27వ సం.రానికి అక్రిడిటేషన్ల జారీకి కమిటీ ఆమోదం

**జిల్లా కలెక్టర్ డీఎంఎసి చైర్మన్ శ్రీధర్ చెరుకూరి**



**వైయస్సార్ చీఫ్ బ్యూరో నవరి 30: నంది పత్రిక** జిల్లాలోని అర్హులైన 569 మంది జర్నలిస్టులకు తొలి విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందనీ డిఎంఎసి చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీఎంఏసి చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందని,మొదటి సమావేశంలో 569కి కమిటీ ఆమోదం తెలిపిందనన్నారు. ఇంకనూ అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం లో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డి ఎం ఏ సి కన్వీనర్ పద్మజ,డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్,ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి , డీఎంహెచ్ నాగరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రంగ రాజు, పిడి హౌసింగ్ రాజారత్నం, రైల్వే పీఆర్వో జనార్ధన్,బ్యూరో చీఫ్ విశాలాంధ్ర పి.రామసుబ్బా రెడ్డి,బ్యూరో చీఫ్ ఆంధ్ర జ్యోతి ఈ.ఆంజనేయులు, స్టాఫ్ రిపోర్టర్ ప్రజాశక్తి నూర్ బాషా,స్టాఫ్ రిపోర్టర్ ఈ టివి జి.మురళి మోహన్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్ హెచ్ యంటివి వి.యం.చంద్ర మోహన్ రాజు,రిపోర్టర్,వార్త ఆర్.మనోహర్, రిపోర్టర్ ఆంధ్రప్రభ ఐ.సి.సుబ్బారెడ్డి,ఎడిటర్ రాయలసీమ సమయం ఏ.సందీప్ కుమార్ రెడ్డి,ఎడిటర్ కొత్త తరంగం కె.రమేష్,స్టాఫ్ రిపోర్టర్ మహా న్యూస్ యు శ్రీకాంత్, కరస్పాండెంట్ ప్రసార్ భారతి బి.శ్రీనాథ్ రెడ్డి, ఫోటోగ్రాఫర్, ఆంధ్ర జ్యోతి టి.రత్నయ్య, పాల్గొన్నారు..



# రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్ గా రూపొందిస్తాం










**కోకో పంటకు ఆయిల్ పామ్ పంట రీతిలో గిట్టుబాటు ధర కల్పించేందుకు కొత్త చట్టాన్ని తీసుకువస్తాం**

**నాణ్యమైన కోకో ఉత్పత్తిపై రైతులకు అవగాహన కలిగిస్తున్నాం**

**త్వరలో విజయవాడలో అంతర్జాతీయ హార్టికల్చర్ కాంక్లేవ్ సదస్సు నిర్వహిస్తాం**

**ఉద్యానవన పంటల అభివృద్ధి దిశగా రాష్ట్రం**

**ఏలూరులో రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సును ప్రారంభించిన వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు**

ఏలూరు, చీఫ్ బ్యూరో జనవరి, 30 : నంది పత్రిక రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్ గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజారాపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక చింతలపూడి రోడ్డులోని బాలాజీ గార్డెన్స్ ఫంక్షన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సును మంత్రి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కోకో పంటను మరింత విస్తీర్ణంలో పెంచేలా రైతులను ప్రోత్సహించేందుకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తి, సాగులో తీసుకోవలసిన మెళకువలు, మార్కెటింగ్ సౌకర్యాలు, తదితర అంశాలపై అధికారులు, ఉద్యానవన శాస్త్రవేత్తలతో కోకో అభ్యుదయ రైతులకు అవగాహన కలిగించడమే రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. రైతుల ప్రతీ సమస్యను ముందుగానే తెలుసుకుని వాటి పరిష్కార దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర జీఎస్డిపి లో వ్యవసాయం 50 వేల కోట్ల రూపాయలు ఉంటె ఉద్యానవన శాఖ 1. 68 లక్షల కోట్లు ఉందన్నారు. రాష్ట్రంలో రైతులకు మంచి ఆదాయం అందించేలా ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నామని, ఉద్యానవన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు, ఆటోమేషన్ అందిస్తున్నామన్నారు. విజయవాడలో అంతర్జాతీయ స్థాయిలో హార్టికల్చర్ కాంక్లేవ్ సదస్సును త్వరలో పెద్దఎత్తున నిర్వహించి ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని ఏర్పాటు చేసి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి గత ప్రభుత్వం 7500 కోట్లు కేటాయించినప్పటికీ, 5 సంవత్సరాలలో కేవలం 1300 కోట్లు రూపాయలు మాత్రమే రైతులకు అందించిందన్నారు. తమ ప్రభుత్వం గత బడ్జెట్లో 300 కోట్లు కేటాయించి సంవత్సరకాలంలో 1200 కోట్ల రూపాయలు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకానికి రైతులకు అందించామన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన కోకో ఉత్పత్తిపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామని, పంట కోత అనంతరం కోకో గింజల నాణ్యత తగ్గకుండా ఉండేలా తీసుకోవలసిన చర్యలపై రైతులకు తెలియజేస్తున్నామన్నారు. దీనికారణంగా కోకో పంటకు మంచి ధర లభిస్తుందన్నారు.

రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ కోకో పంట సాగులో తక్కువ ఖర్చుతో, నాణ్యమైన పంట అధిక దిగుబడి, రైతుకు లాభసాటిగా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. కోకో కాంక్లేవ్ సదస్సును శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కలిగించి, నాణ్యమైన కోకో ఉత్పత్తి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రభుత్వ, బ్యాంకర్ల సహకారం తదితర అంశాలు కాంక్లేవ్ లో తెలియజేస్తారన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో 44 వేల 984 ఎకరాలలో కోకో సాగవుతూ, 10 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తితో దేశంలోనే ఏలూరు జిల్లా ప్రథమస్థానంలో ఉందన్నారు. స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా జిల్లా జీడిపి వృద్ధిలో లో ఉద్యానవన పంటల పాత్ర ప్రధానమైనదన్నారు. పంట కోత అనంతరం కోకో గింజల నాణ్యత తగ్గకుండా ఉండేలా తీసుకోవలసిన చర్యలపై రైతులకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. జిల్లాలో అదనంగా 1200 హెక్టార్లలో కోకో పంట వేసేలా 15 వేల మంది రైతులకు శిక్షణ అందించామన్నారు. నాణ్యమైన కోకో గింజల సాగుపై అధ్యాయానికి జిల్లాలోని కోకో అభ్యుదయ రైతులను కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు పంపించామన్నారు. జిల్లాలో 100 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లలో భాగంగా 7 చాకొలెట్ పరిశ్రమలు ద్వారా సంఘాలచే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన కోకో ఉత్పత్తికి రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సులో శాస్త్రవేత్తల సూచనలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత సంవత్సరం కోకో పంటకు ధర లేనప్పుడు రాష్ట్రప్రభుత్వం కిలోకి 50 రూపాయలు అందించిందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సు శాస్త్రవేత్తలు అందించే సూచనలతో కోకో రైతులు తక్కువ ఖర్చుతో, నాణ్యమైన కోకో అధిక దిగుబడి సాధించాలన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ కోకో ఉత్పత్తిలో దేశంలో చింతలపూడి నియోజకవర్గం ప్రథమస్థానంలో నిలుస్తుందన్నారు. విదేశాల నుండి కోకో మొక్కలు దిగుమతి చేసుకుని వినియోగిస్తే కోకో నాణ్యతనాణ్యమైన కోకో ఉత్పత్తి సాధించి, కోకో ధరలో విదేశాలతో పోటీపడవచ్చున్నారు. చాకొలెట్ ఆరోగ్యానికి మంచిదని, యూరప్ దేశాలలో సంవత్సరానికి 9 కేజీలకు పైగా చాకొలెట్ వినియోగం ఉంటె, మన దేశంలో కేవలం కేజీ మాత్రమే వినియోగిస్తున్నారన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ దేశంలోనే అధిక కోకో ఉత్పత్తి చేస్తున్న ఏలూరు జిల్లాలో కోకో ప్రాసెసింగ్ యూనిట్లు, చాకొలెట్ పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మన దేశంలో కోకో మొక్క 3 నుండి 4 కేజీలు కోకో గింజలు ఉత్పత్తి చేస్తుంటే, విదేశాలలో 8 కేజీల వరకు దిగుబడి వస్తుందన్నారు. నాణ్యమైన కోకో ఉత్పత్తి చేస్తే కేజీకి 150 రూపాయలకు పైగా అదనంగా ఆదాయం లభిస్తుందని, ఈ దిశగా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమం ఉద్యానవన శాఖ కమీషనర్ కె. శ్రీనివాసులు, ఏలూరు ఉద్యానవన శాఖాధికారి సాజా నాయక్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్, హార్టికల్చర్ వైస్ ఛాన్సలర్ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ, ఉద్యానవన విభాగానికి చెందిన జాతీయ సంస్థల డైరెక్టర్లు / అధిపతులు, భూజ×, ఐజజబ, చీ×ఖీజుఏ-, భూజూ, జూభీభూజు, ××ఎ౯-ూ౯ఎజ పరిశోధనా సంస్థలు మరియు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ (జశీఔ) ప్రతినిధులు మరియు ప్రముఖ జాతీయ బ్యాంకు ప్రతినిధులు, కోకో ప్రాసెసింగ్ పెట్టుబడి దారులు, కోకో అభ్యుదయ రైతులు, ప్రభుత్వాలు పాల్గొన్నారు. అనంతరం కోకో పంటలో అధిక దిగుబడి, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై ముద్రించిన కరపత్రాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ని, ఎమ్మెల్యే లు, జిల్లా కలెక్టర్, హార్టికల్చర్ ఉన్నతాధికారులను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలు, బ్యాంకర్లు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించారు.







## జిల్లాలో అప్పడా రిజిస్ట్రేషన్స్ ఫిబ్రవరి 10 నాటికి నూరు శాతం పూర్తి చేయాలి.

**అప్పడా రిజిస్ట్రేషన్ ద్వారా ఆక్వా రైతులకు కలిగే ప్రయోజనాలపై విస్తృతమైన అవగాహన కల్పించాలి.**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

భీమవరం చీఫ్ బ్యూరో జనవరి 30 నంది పత్రిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం అప్పడా రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణాల ప్రగతి, ఇపిటిఐఎన్ ఫైల్స్ అప్లోడింగ్ అంశాలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మత్స్య శాఖ అధికారులు, ఎమ్ డి ఓ లు, ఎంపీ వోలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,31,436 ఎకరాలలో ఆక్వా సాగు జరుగుతుందని, ఇప్పటివరకు 66,340ఎకరాలు అప్పడాలో రిజిస్ట్రేషన్ జరిగిందని, 39,413 ఎకరాలు అప్పడలో రిజిస్టర్ కావలసి ఉందన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నాటికి నూరు శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని మత్స్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అప్పడా రిజిస్ట్రేషన్ ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకమైన ఫ్లెక్సీ తయారు చేయడం జరిగిందని, వాటి ద్వారా అధికారులు రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అప్పడా రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల ఉత్పత్తులకు మాత్రమే విదేశాలు అనుమతించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా చిన్న, పెద్ద రైతులందరికీ విద్యుత్ రాయితీ లభిస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే నష్టపరిహారం లభిస్తుంది అన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా లభించే ప్రయోజనాలపై తయారుచేసిన ఫ్లెక్సీ ను అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతిరోజు 2 వేల ఎకరాలకు పైబడి రిజిస్ట్రేషన్ పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. అప్పడా రిజిస్ట్రేషన్ ద్వారా చట్టబద్ధ అనుమతి, ప్రభుత్వ పథకాల లబ్ధి, వివాదాల నివారణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఈపిటీఐఎన్ పోర్టల్ లో ఫైల్స్ అప్లోడింగ్ పై అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. కార్యాలయాల్లో ప్రతి ఫైలును ఇపిటీఐఎన్ పోర్టల్ లో అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు జిల్లాలో రాన్ను ఉగాది నాటికి 9,135 గృహాలు లబ్ధిదారులకు అందించాల్సి ఉందని, యుద్ధ ప్రాతిపదికన గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ సురేష్, సహాయ సంచాలకులు ఎల్ఎల్ రాజు, ఎంపీడీవోలు, ఎపిఓలు, తదితరులు పాల్గొన్నారు.



## నేడే జూపాడు బంగ్లా ఎంపీపీ పై అవిశ్వాస తీర్మానం...

**అవిశ్వాస తీర్మానం రిటర్నింగ్ అధికారిగా ఆర్డీఓ.**

**అవిశ్వాస తీర్మాన ఏర్పాట్ల పై సమీక్ష చేసిన మండల స్థాయి అధికారులు.**



జూపాడుబంగ్లా:జనవరి: 30 :(నంది పత్రిక): నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం లోని జూపాడు బంగ్లా మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పి సువర్ణమ్మ పై శనివారం ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మండల స్థాయి అధికారులు శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో మండల తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్,ఎంపీడీవో గోపీకృష్ణ, ఎస్సై మల్లికార్జున, డిప్యూటీ తాసిల్దార్ ఎస్. నాగన్న లు అవిశ్వాస తీర్మాన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానాని కి సంబంధించి రిటర్నింగ్ అధికారిగా ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఎంపీపీ పై జరుగుతున్న అవిశ్వాస తీర్మానానికి సంబంధించి మొత్తం మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా తాటిపాడు, తర్తూరు ఎంపీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయని వారు తెలిపారు. ఎంపీపీ పై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఉత్కంఠ గా కొనసాగుతుంది. అవిశ్వాస సందర్భంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఎంపీడీవో కార్యాలయం చుట్టు గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్ ఐ. కె మల్లికార్జున తెలిపారు. ఎంపీపీ పై సహచర ఎంపీటీసీలు ప్రవేశపెట్టిన అవిశ్వా సం పై ఎలాంటి నిర్ణయమైనా రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి దే తుది నిర్ణయమని ఎంపీడీవో గోపికృష్ణ తెలిపారు.

## ఎన్టీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి:

**టిడిపి సీనియర్ నాయకులు మండ్రా సురేంద్ర నాథ్ రెడ్డి.**

**బ్రాహ్మణ కొట్కూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన టిడిపి నాయకులు.**



నందికొట్కూరు జనవరి 30 ( నంది పత్రిక) టిడిపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు ను అవమాన పరుస్తూ సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు మండ్రా సురేంద్రనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు పోలీస్ స్టేషన్ నందు ఎక్స్ వేదికలో కళ్యాణ్ బాబు పాన్ అకౌంట్లో నందమూరి తారకరామారావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు మండ్రా సురేంద్ర నాథ్ రెడ్డి , సొసైటీ చైర్మన్ మద్దూర్ హరి సర్వోత్తమ రెడ్డి లు టిడిపి నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ ఖలీల్ బేగ్, లక్ష్మీనారాయణ, ఖాజా మొహిద్దీన్, లాడెన్ మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మాతృ మరణాలు శిశు మరణాలు సున్న స్థాయికి తగ్గించడమే లక్ష్యం

**జన్మనిస్తూ తల్లి మరణించకూడదు జన్మిస్తూ శిశువు మరణించకూడదు...**

**డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి**



భీమవరం చీఫ్ బ్యూరో జనవరి 30 నంది పత్రిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరము నందు శుక్రవారం డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి అధ్యక్షతన గత సంవత్సరం అక్టోబర్ నెల నుండి డిసెంబర్ నెల వరకు జిల్లాలో జరిగిన మాతృ మరణాలు శిశు మరణాలపై సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ జన్మనిస్తూ తల్లి మరణించకూడదు, జన్మిస్తూ శిశువు మరణించకూడదు అన్నారు. జిల్లాలో మాతృ శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించారు. మాతృ మరణాలు శిశు మరణాలు జరిగిన హాస్పిటల్స్ డాక్టర్లను జరగడానికి గల కారణాలు, దాని నివారణ చర్యలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. మాతృ మరణాలు శిశు మరణాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యముగా ప్రసూతి అనంతరం జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లయితే 100 శాతం మాతృ మరణాలు నివారించవచ్చునని అన్నారు. శిశుమరణాల విషయంలో గర్భిణీ సమయము నుండి ప్రసవించే సమయం వరకు అవసరమైన జాగ్రత్తలు మరియు ప్రసవం తరువాత శిశువుల ఆరోగ్య స్థితిగతులు నిరంతరం పర్యవేక్షణ ఉన్నట్లయితే వాటిని నివారించవచ్చునని డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జి.గీతాబాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, ప్రైవేట్ హాస్పిటల్స్ డాక్టర్లు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ఆశాలు, ఏఎన్ఎం లు అంగన్వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు జనవరి 31న జిల్లాలో పర్యటించనున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

భీమవరం: చీఫ్ బ్యూరో జనవరి 30 నంది పత్రిక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈనెల 30వ తేదీ శుక్రవారం సాయంత్రం 6.00 గంటలకు తాడేపల్లి నివాసం నుండి నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి రాత్రి 8. 00 గంటలకు భీమవరం చేరుకుని రాత్రి బస చేస్తారు. 31వ తేదీ ఉదయం 9.00 గంటలకు మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఉదయం 9:30 గంటలకు భీమవరం 9వ వార్డు హౌసింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా సుందరీకరించిన మున్సిపల్ పార్కును ప్రారంభిస్తారు. ఉదయం 9:45 గంటలకు భీమవరం 26 వార్డు బొక్క వారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన ఏర్పాటుచేసిన డిఆర్సి సమావేశంలో పాల్గొంటారు. భోజనం విరామం అనంతరం మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.00 గంటల వరకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. సాయంత్రం 4.00 గంటలకు భీమవరం నుండి బయలుదేరి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారని జిల్లా సమాచార శాఖ ఇక ప్రకటనలో తెలిపింది.

## నాటు సారా స్వాధీనం..
## బెల్లం పూట ను ధ్వసం ఎక్సైజ్ పోలీసులు.



**నందికొట్కూరు జనవరి 30 ( నంది పత్రిక)** జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం నందికొట్కూరు పరిధిలోని అల్లూరు మరియు కోల్లభవాపురం గ్రామంలో ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్సైలు జఫ్రుల్లా, శ్రీనివాసులు భాష్యం, కర్నూల్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై మధుసూదన్ రెడ్డి లు తమ సిబ్బందితో కలిసి మొదటగా అల్లూరు గ్రామం నందు నాటు సారా విక్రయిస్తున్నారని సమాచారం మేరకు జరిపిన దాడుల్లో పాఠశాల కలిగి ఉన్న దాసరి వంశీ అనే వ్యక్తి వద్ద నుండి 8 లీటర్ల స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా కొల్లబాపురం గ్రామంలో అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీస్తావారాలపై ఆకస్మిత కొనసాగించారు. ఈ దాడుల్లో తయారు చేయడానికి సిద్ధం చేసి ఉన్న 30 ప్లాస్టిక్ బిందెల్లో 450 లీటర్ల బెల్లం పూట బిందెలను ధ్వంసం చేశారు. అనంతరం సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ చట్ట వ్యతిరేకంగా నాటసార తయారుచేసిన విక్రయించిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది శేఖర్ నాయకుడు, శివన్న, సుధీర్ కుమార్, మధుసూదన్ ప్రసాద్, సంధ్యారాణి, రాజశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## నేటి సమాజం లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం
### ఎస్సీఎస్టీయూఎస్ డైరీ ని ఆవిష్కరించిన డిఈఓ



**నంద్యాల బ్యూరో, జనవరి 30(నంది పత్రిక):-** నేటి సమాజంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణం లోని జిల్లా సోషల్ ఆడిట్ సమావేశంలో ఎస్సీఎస్టీయుఎస్ డైరీనీ జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం డిఈఓ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు ఎలాంటి అన్యాయం జరిగిన తన దృష్టికి తేవాలని సంఘానికి తెలియజేశారు. ఆయనతో పాటు జూపాడుబంగ్లా ఎంఈఓ -1 మద్దిలేటి నాయక్, మహానంది ఎంఈఓ -2 విజయ్ కుమార్, పాణ్యం ఎం ఈ ఓ -2 సుబ్రమణ్యం ఆవిష్కరించారు. కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**మహానంది. జనవరి 30 . (నంది పత్రిక ):**నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ లో ఉన్న నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సత్రం లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 400 మందికి పైగా ఉచిత వైద్యం, 3500 రూపాయలు విలువగల పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్, స్త్రీ ప్రసూతి మరియు సంతాన సాఫల్య నిపుణులు డాక్టర్ అరుణకుమారి, గైనకాలజీ లాప్రోస్కోపీ వైద్యులు డాక్టర్ డి ఫాతిమా బి, కాస్మటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ కె పద్మ ప్రియాంక, ఎముకలు మరియు కీళ్ల వ్యాధి నిపుణులు డాక్టర్ సుమన్ కుమార్ తదితరులు వైద్యం ఉచితంగా సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లె గ్రామ పెద్దలు ప్రజలు నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోరుమామిళ్లలో యూరియా కోసం రైతుల అవస్థలు..
## తోపులాటల మధ్య పడిగాపులు



**పోరుమామిళ్ల, జనవరి 30 (నంది పత్రిక )** కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణం మరియు పరిసర గ్రామాల రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోరుమామిళ్ల పట్టణంలోని గోపీకృష్ణ ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్ వద్ద కావలసినంత యూరియా ఉందన్న సమాచారం రావడంతో పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకుని బారులు తీరారు. ఎకరానికి సుమారు రూ.50 వేల పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తున్నామని, కానీ అవసరమైన సమయంలో యూరియా దొరకక పడిగాపులు కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపిస్తున్నారు. పోరుమామిళ్లలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాపుల యజమానులు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు ఒక్కో షాపు వద్ద నుంచి ఒక్కో రైతుకు రెండు మూటల యూరియాకు మాత్రమే కూపన్లు ఇస్తుండటంతో, సరిపడా స్టాక్ లేక కొందరు రైతులకు మాత్రమే యూరియా లభిస్తోంది. దీంతో యూరియా కోసం వచ్చిన పలువురు రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. రైతుల మాటల్లో, పోరుమామిళ్లలోని ప్రతి ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్‌లో యూరియా స్టాక్ ఎక్కువగానే ఉందని, అయితే అధికారిక ధర రూ.270 ఉన్నప్పటికీ, ఒక మూటకు రూ.500 ఇస్తేనే యూరియా ఇస్తామని దుకాణదారులు చెబుతున్నారని ఆరోపించారు. అధిక ధరలకు అమ్మాలనే ఉద్దేశంతోనే యూరియాను నిల్వ ఉంచుతున్నారని రైతులు అంటున్నారు. అగ్రికల్చర్ అధికారులు ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్ యాజమాన్యానికి తలవొగ్గి పనిచేస్తున్నారంటూ రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతులకు తగినంత యూరియాను సంబంధిత సచివాలయాల ద్వారా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

## చౌడేశ్వరి అమ్మవారికి వెండి గిన్నెలు బహూకరణ



**బనగానపల్లె జనవరి 30నందిపత్రిక** శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి ధర్మవరం, ముద్దిరెడ్డి పల్లె వాస్తవ్యులు బలం హరి వారి కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయమునకు 2 వెండి గిన్నెలు 0.344 గ్రాములు ( సుమారు నలభై రెండు వేల ఆరు వందల రూపాయలు) ఆలయ అసిస్టెంట్ కమిషనర్/ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి సమక్షంలో ఆలయమునకు అందచేశారు.ఆలయ అర్చకులు వారి పేర అమ్మవారికి పూజలు గావించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## టిడిపి కార్యకర్తల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



**ఆళ్లగడ్డ ప్రతినిధి జనవరి 30 నంది పత్రిక** మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరుగుతున్న టిడిపి కార్యకర్తల శిక్షణ తరగతులు జరుగుతున్నాయి అందులో భాగంగా శుక్రవారం నాడు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ శిక్షణ తరగతులకు హాజరై తరగతి లో షెడ్యూల్లో భాగంగా టిడిపి కార్యకర్తలకు సూపర్ సిక్స్ ఇతర పథకాలను లబ్ధిదారులకు ఎలా పథకాలు ఇవ్వాలి అనే సమస్యలపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చర్చించారు.



## జిల్లాలో ప్రభుత్వ భూములు, కాలువలు, చెరువుగట్లపై వున్న ఆక్రమణలను తక్షణమే తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.
### జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి.



**భీమవరం చీఫ్ బ్యూరో జనవరి 30 నంది పత్రిక** జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి శుక్రవారం ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలతో గూగుల్ మీట్ ద్వారా వాచ్ డాగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఇరిగేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ పరిధిలో వాటర్ బాడీస్ తదితర ఆక్రమణలను తొలగించి నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఎన్ని ఎకరాలు ఆక్రమణలలో ఉన్నది, ఏ మేరకు తొలగింపు కార్యక్రమం చేపట్టారు సమీక్షించారు. డివిజనల్, మండల స్థాయిలలో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి వారం ఆక్రమణల తొలగింపుపై చేపట్టవలసిన కార్యాచరణ పై చర్చించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణ ప్రాంతంలో పట్టాలు మంజూరై శాశ్వత కట్టడాలు ఉన్న వాటి వివరాలను ఒక నివేదిక అందజేయాలన్నారు. దీనిపై జిల్లా స్థాయిలో తదుపరి సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ శాఖ కు సంబంధించి ఆక్రమణదారులకు తాసిల్దారుల ద్వారా నోటీసులు అందజేసి, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకొని ప్రగతి నివేదికలను అందజేయాలన్నారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆక్రమణల తొలగింపుపై పర్యవేక్షించాలని డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి అధికారులు ఆదేశించారు. ఈ గూగుల్ మీట్లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ ఎండిఓలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో అక్షరాస్యత




**ఏలూరు, జనవరి, 30:** అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో అక్షరాస్యత పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం సాయంత్రం అక్షర ఆంధ్ర, యూనిఫైడ్ ఫామిలీ సర్వే, పీ4, తదితర కార్యక్రమాలపై సంబంధిత శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భముగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలోని 97 వేల 200 మందికి అక్షరాస్యత, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత అందించడం లక్ష్యంగా నిర్ణయించామని, ఇందుకు సంబంధించి అభ్యాసకులు వివరాలు యాప్ లో సంబంధిత సచివాలయ సిబ్బంది శనివారం నాటికి నమోదు చేయాలన్నారు. గ్రామ/వార్డ్ సచివాలయ సిబ్బంది, డిఆర్డిఏ , డ్వామా సిబ్బంది అక్షర ఆంధ్ర కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. యూనిఫైడ్ ఫామిలీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. పీ4 కార్యక్రమం జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలు, మార్గదర్శులు వివరాలను పీ4 యాప్ లో నమోదు చేయాలనీ, బంగారు కుటుంబాలకు అవసరమైన చేయూత వివరాలు మార్గదర్శులు తో అనుసంధానంనకు చర్యలు తీసుకుని, వివరాలను యాప్లో నమోదు చేయాలన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, ఎంపిడిఓలు, నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల కమిషనర్లు, పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవాలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి జనవరి 30, నంది పత్రిక** అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పారువేట ఉత్సవాలు ఆళ్లగడ్డలో అత్యంత వైభవంగా ప్రారంభ మయ్యాయి. శుక్రవారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా మొదటి తెలుపు వద్దకు స్వామి వారి పల్లకి చేరుకోవడంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవ తెలుపు పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అధికారులు పార్వేట పల్లకికి ఎదురేగి వెళ్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వాముల వారికి ఘన స్వాగతం పలికారు. డీఎస్పీ ప్రమోద్, పట్టణ సీఐ యుగంధర్, ఎస్సైలు షేక్ నగీన, శ్రీనివాస్ గౌడ్, పోలీస్ సిబ్బంది శ్రీ స్వామివారికి పూజలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ కార్యాలయానికి సంబంధించి అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి, ఎమ్మార్వో కార్యాలయంకు సంబంధించి ఆర్ ఐ నర్సిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, సిబ్బందితోపాటు ట్రెజరీ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామివారి ఆశీస్సులు అందించారు. అనంతరం పట్టణంలోని ఆయా తెలుపులపై ఉత్సవమూర్తులు ఆసీనులు కాగా తెలుపుల కుటుంబాలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోనీ, పూలమాలలు, టెంకాయలు, పండ్లు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందించారు.





నంది పత్రిక
శనివారం 31 - 01 -2026

# హితవచనాలతో దైవానుగ్రహ ప్రాప్తికి దారిచూపే సద్గురువులు.

## సద్గురువుల సాన్నిధ్యంతోనే దైవానుగ్రహ ప్రాప్తి.
## -పూర్వజన్మ సుకృతముంటేనే సద్గురువుల అనుగ్రహం.

మంత్రాలయం జనవరి30 (నందిదినపత్రిక ప్రతినిధి) పూర్వజన్మ సుకృతముంటేనే సద్గురువుల అనుగ్రహం లభిస్తుందన్నది ఇతిహాసాల సారం. భగవంతుని దయపొందటానికి మనకు మార్గాన్ని చూపించగల వ్యక్తి గురువు. అందుకేనేమో "గురుర్ విష్ణు, గురుదేవో మహేశ్వరః, గురుసాక్షాత్ పరబ్రహ్మ-అంటున్నాయి పుణానేతిహాసాలు. ప్రతి మానవుడికి తన జీవితంలో గురువు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి. సద్గురువుల సాన్నిధ్యం లేకుండా భగవంతుని దయను పొందటం దుర్లభమని వేదపండితులు పేర్కొంటున్నారు. మనిషికీ మొదటి విషయం గురుదయ. మనకు ఆగురుదయ ఉంటే మనకు ఆయన మార్గ దర్శకత్వంకు అనుగుణంగా మనం ప్రవహరిస్తే మనం భగవంతుని సన్నిధికీ చేరి ఆయన కృపను పొందు తామని, లేకపోతే సాధించేది ఉండదన్నారు వీజ్ఞులు. ఈకారణంగా గురుదయ మనిషికి అవసరమని పురాణాలు పేర్కొంటూ ఉన్నాయి. గురువు బోధించిన దానిని సాధ్యమైనంత వరకు అనుసరించడం మనిషి విధి అంటున్నాయి ఇతిహాసాలు. గురువు బోధించిన దానిని సాధ్యమైనంతవరకు అనుసరించడం మనిషి విధి అంటున్నాయి ఇతిహాసాలు.



గురువు బోధించిన దానిని సాధ్యమైనంత వరకూ అనుసరించాలని తద్వారా దైవానుగ్రహ ప్రాప్తి లభ్యమౌతుందట. గురువు నోట వెలువడిన విషయాలను ఆచరించడం తప్ప ఆలోచించడం వల్ల సమకూరే ప్రయోజనం ఏమీ ఉండదు అన్నది వేదసారం, గురువు మనకు చెప్పే ప్రతివిషయాన్ని ఆచరించిన తర్వాతనే మనక బోధించడం జరుగుతుంది కాన వితండవాదం మంచిది కాదని అనుభవజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు. గురువు ఆదేశాలను గురించి ఆలోచించ కుండా విధేయతతో ఆచరించడం మన కర్తవ్యం. అనేక జన్మలలో మనం చేసుకొన్న పూర్వకర్మల పుణ్య ఫలమే. మంచి గురువుల ఆశీస్సులు అందుతాయన్నది వేదోక్తి. సన్మార్గ నిర్దేషకులు గురువులు మాత్రమే అన్నది అక్షర సత్యం మరి. గురుభ్యోనమః.

# మహాత్ముడివి మూడు బాధలు!

సత్యమే దేవుడని నమ్మిన మహామనిషి మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. మన దేశపు భిన్నత్వంలోని ఏకత్వాన్ని మనసా వాచా కర్మణా నమ్మి ప్రజల మధ్య వైషమ్యాలు లేని సమైక్య భారతావనిని కలగన్న దార్శనికుడు. ఆయన సంప్రదాయవాది కాదు, అదే సమయంలో అభ్యుదయవాదీ కాదు. కేవలం ఇంగిత జ్ఞానంతో పనిచేసిన ఒక ఆదర్శవాది. గాంధీని జీవితాంతం బాధించిన విషయాలు ప్రధానంగా మూడు ఉన్నాయి. ఒకటి, హిందూ ముస్లిం ఐక్యత లేకపోవడం. రెండు, దళితులు అభ్యున్నతి పొందకపోవడం. మూడవది, దరిద్ర నారాయణుల్ని పేదరికం నుంచి బయట పడవేయలేకపోవడం. గాంధీ రచనలన్నిటా ఈ విషయాలే కీలకంగా ఉంటాయి. "నేను నమ్మే సిద్ధాంతాలు, ఆదర్శాలు వ్యాప్తిలో ఉన్నంత కాలం, మరణానంతరం సైతం జీవించే వుంటాను" అని చెప్పారాయన. 20వ శతాబ్ది రాజకీయ నాయకుల్లో అత్యధికంగా మానవాళిని ప్రభావితం చేసిన నాయకుడు గాంధీ. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే విలువలతో ప్రపంచవ్యాప్తంగా నైతిక రాజకీయానికి మార్గదర్శిగా నిలిచాడాయన. దేశ స్వాతంత్ర్యం సిద్ధించి ఏడున్నర దశాబ్దాలు గడిచాక నేడు, గాంధీని హత్య చేసిన గాడ్సేను కీర్తిస్తూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలు భారతజాతి నైతికత మీద దాడి చేయడమే. అన్ని జాతులు, మతాలు కలగలిసి సమైక్యంగా జీవించాలనే ఆకాంక్ష కోసం ఆయన చెల్లించిన మూల్యం ప్రాణం. ప్రజాస్వామ్యంలో హింసను, హత్య చేసిన వారిని కీర్తించడం అంటే ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే. దేశానికి గాంధీ లేకున్నా స్వాతంత్ర్యం వచ్చేదేమో కానీ, గాంధీ ఐడియాలజీ లేకుండా దేశం ఇంతటి ప్రశాంతతను పొందేది కాదు. మార్టిన్ లూథర్‌కింగ్ అమెరికాలో నల్ల జాతీయులకు హక్కులు సాధించినా, నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికాకు స్వాతంత్ర్యం తెచ్చినా... మహాత్ముడి అహింసా మార్గమే వారికి ఆదర్శం. గాంధీ సత్యాగ్రహం అంటే తనను తాను ఆత్మపరిశీలన, ఆత్మ పరివర్తన చేసుకోవడం. మనిషిలో హింస, కోపం, అహంకారం, ద్వేషం ఉన్నప్పుడు ఇతరులకు మార్గదర్శిగా నిలవడం నైతికంగా సరైంది కాదని ఆయన నమ్మారు. ఇదే గాంధీ సత్యాగ్రహానికి



పునాది. తనతో తాను నిజాయితీగా ఉండకపోతే, సత్యం కోసం సమాజంతో పోరాడే నైతిక హక్కు ఉండదని నమ్మారు. చౌరీచౌరా సంఘటనలో హింస జరిగిందని, తాను నైతికంగా సమాజాన్ని అహింస వైపు నడిపించడంలో విఫలమయ్యానని భావించి ఉద్యమాన్ని ఆపేశారు. ఇది గాంధీలోని ఆత్మపరిశీలనకు ఒక గొప్ప తార్కాణం. అలాగే గాంధీ దృష్టిలో ధర్మం అంటే సత్యం, అహింస, నైతికతపై ఆధారపడిన జీవన విధానం. ధర్మం వ్యక్తిగత, సామాజిక రాజకీయ రంగాలన్నిటిలోనూ నైతిక బాధ్యతను సూచిస్తుంది. వ్యక్తికీ వ్యక్తికీ, వ్యక్తికీ సమాజానికీ, సమూహానికీ సమూహానికీ మధ్య సంబంధాలను నిర్వచించే విలువగా ధర్మాన్ని ప్రస్తావించారు. గాంధీ దృష్టిలో సన్యాసి అంటే అంతర్ముఖ నైతికత, సామాజిక బాధ్యత, బాహ్యజీవన రీతిగా ఆచరించేవారు; ముఖ్యంగా బలహీనుల పక్షాన నిలబడే ఆధునిక వేదాంతి; సమాజం నుంచి పారిపోయేవారు కాదు, ఒక నైతిక పోరాట యోధుడు. స్వదేశీ గురించి విస్తృతంగా ప్రచారం చేసిన గాంధీ... కేవలం దేశీయ వస్తువుల వాడకం, విదేశీ వస్తువుల బహిష్కరణ మాత్రమే కాదు. దానిని ఒక సామాజిక, ఆర్థిక కార్యక్రమంగా ముందుకు నడిపారు. ఖద్దరు ఉత్పత్తి, సత్యాగ్రహం, రైతు ఉద్యమాలు, దేవాలయ ప్రవేశాలు ఇవన్నీ కూడా ప్రజలను కుల, మత రహితంగా ఐక్యం చేయడానికి ఉద్దేశించిన కార్యాచరణలు. తోటి మానవుల పట్ల ప్రేమ, దయ, గుణాలతో వ్యవహరించడం, మానవసేవే మాధవ సేవగా ఆచరించడం... గాంధీ దృష్టిలో సనాతనం. గాంధీ సనాతనవాదం ఏ విషయాలపైనా మొండిగా వ్యవహరించదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఆధ్యాత్మిక మార్గాన్ని చూపుతుంది. "నా హిందూయిజం ఎవరినీ వెలివేయదు. అన్ని తరగతులను కలుపుకుపోయే సమగ్రతా సిద్ధాంతం" అంటారు గాంధీ. అస్పృశ్యతకు వ్యతిరేకంగా గాంధీ పెద్ద యుద్ధం చేశారు. హిందూ శాస్త్రాల భావం సమానత్వాన్ని ప్రసాదించేదే తప్ప అస్పృశ్యతను ప్రోది చేసేది కాదని పలు సందర్భాల్లో అన్నారు. 'హరిజన' పేరుతో ఒక పత్రికను స్థాపించి, అహింసా సిద్ధాంతానికి అస్పృశ్యత విరుద్ధమని చాటారు. సాటి మనిషిని తక్కువగా, అవమానకరంగా చూడడం భగవద్గీత సందేశానికి కూడా వ్యతిరేకమని హిందూ సమాజాన్ని హెచ్చరించారు. హిందూ మతంలో అంతర్గత సంస్కరణల కోసం పోరాటం చేసిన చిట్టచివరి నాయకుడు మహాత్మాగాంధీ. సత్యమే దేవుడని నమ్మిన ఆయన దైవాన్వేషణలో ఎవ్వరూ మతం మారాల్సిన అవసరం లేదని చెప్పారు. గాంధీ లేకుండా స్వాతంత్ర్యోద్యమాన్ని, అంబేద్కర్ లేకుండా భారత రాజ్యాంగాన్ని, నెహ్రూ లేకుండా ఆధునిక భారతాన్ని ఊహించలేం. వీరి ఆలోచనలు, ఆచరణ భారతీయ మూలాల నుంచి ఉద్భవించాయి. ఇటీవల మహాత్ముడిని తక్కువ చేస్తూ వస్తున్న పెడధోరణులు గాంధీ వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నాలు. పౌర సమాజం ఈ పోకడలను గుర్తించి, ప్రజలను వాస్తవికత వైపు నడిపించాల్సిన ఆవశ్యకత ఉంది.

# ఇరాన్‌పై ట్రంప్ దూకుడు

ఇరాన్ పాలకులను అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు. కనీవినీ ఎరుగనంతగా విరుచుకుపడతానని బెదిరిస్తున్నాడు. ట్రంప్ మాటమీద నమ్మకం లేకనో, తనమీద తనకు శ్రుతిమించిన నమ్మకంవల్లనో ఇరాన్ ఎప్పటిలాగానే మాటకుమాట బదులిస్తోంది. ఈ అదిలింపులూ బెదిరింపులకు జడిసేది లేదని, ట్రిగ్గర్ బిగించి సర్వసన్నద్ధంగా ఉన్నామని ట్రంప్‌ను తీసిపారేస్తోంది. ఇరాన్ సీనియర్ నాయకులు లక్ష్యంగా ఈ మారు దాడులు జరిగి, ఈ ముట్టడితో కచ్చితంగా ట్రంప్ ఆశిస్తున్న నాయకత్వం మార్పు సాధ్యపడుతుందని పాశ్చాత్య మీడియా సంస్థల నమ్మకం. ఒకదశలో కాస్తంత తగ్గుముఖం పట్టినట్టుగా కనిపించిన ఖమేనీ వ్యతిరేక ఉద్యమం, తిరిగి తారస్థాయికి చేరడంతో ఇంతకుమించిన మంచిసమయం మళ్ళీ రాదని అమెరికా నమ్ముతోందట. సదరు అంతర్గత సంక్షోభాన్ని వాడుకొని అక్కడ అస్మదీయులను ప్రతిష్ఠించాలన్నది ట్రంప్ కోరిక. గత ఏడాది ఇరాన్ అణుకేంద్రాలమీద తాము దాడులు చేసిన సంగతినీ, వందలాదిమందిని మట్టుబెట్టి రాత్రికి రాత్రి వెనెజువెలా అధ్యక్షుడిని తరలించిన ఇటీవలి దృశ్యాన్ని పదేపదే గుర్తుచేస్తూ, అంతకంటే ఘాటుగా, గట్టిగా దెబ్బకొడతాను జాగ్రత్త అని ఇరాన్ పాలకులను ట్రంప్ హెచ్చరిస్తున్నారు. దాడులకు పాల్పడేముందు చర్చలకు రమ్మని ఇరాన్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అణ్వస్త్రాలకు చోటులేని, సమన్యాయబద్ధమైన ఒప్పందం కుదరాలని అంటూనే, ఆ చర్చలు జరగాలంటే ఇరాన్ ముందుగా సంపూర్ణంగా అస్త్రసన్యాసం చేయాలట. యురేనియం శుద్ధిని పూర్తిగా నిలిపివేయడం, ఖండాంతర క్షిపణుల తయారీపై అమెరికా కొత్త నిబంధనలకు తలొగ్గడం, పశ్చిమాసియాలో ఇరాన్ అనుకూల గ్రూపులకు సహాయసహకారాలు పూర్తిగా నిలిపివేయడం ఈ ఆంక్షల్లో కొన్ని. గత ఏడాది జూన్‌లో జరిగిన కొద్దిరోజుల యుద్ధంలో ఇరాన్ వందలాది క్షిపణులను ఇజ్రాయెల్‌మీదకు ప్రయోగించిన సంగతి తెలిసిందే. వాటివల్ల ప్రాణనష్టం పెద్దగా లేకున్నా, వాటిని నిలువరించి, నిరోధించి తనను తాను రక్షించుకొనే క్రమంలో ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తిని ఎక్కువగా నష్టపోయిందట. ఇజ్రాయెల్ దగ్గరున్న క్షిపణి నిరోధక వ్యవస్థల బలహీనతలు, వైఫల్యాలను కూడా ఆ దాడులు మిగతా ప్రపంచానికి ఎత్తిచూపాయి. ఈ నేపథ్యంలో, శత్రువుచేతుల్లో ఇజ్రాయెల్‌ను చేరగలిగే ఆయుధమే లేకుండా చేయాలని ప్రయత్నం.



# వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగా

## కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర

వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు.జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి.మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి శ్రీమతి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# పేద, మధ్య తరగతి ప్రజలకు 3 వ విడత దీర్ఘకాలిక మందుల కొనుగోలుకై 100 మందికి ఒక్కొక్కరికి 2000 చొప్పున రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించిన వ్యాపార వేత్త గోళ్ళ రాజేష్





నంద్యాల సిటీ బ్యూరో జనవరి 30 ( నంది పత్రిక ). నంద్యాల పట్టణంలో నీ శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో శుక్రవారం కార్యక్రమ నిర్వాహకులు, సీనియర్ రిపోర్టర్ నూర్ బాషా అధ్యక్షతన నంద్యాల వాసి, ప్రముఖ పారిశ్రామికవేత్త గోళ్ళ రాజేష్ ఆర్థిక సహకారంతో పేద, మధ్య తరగతి ప్రజలకుదీర్ఘకాలిక మందుల కొనుగోలుకై మూడవ విడత లో భాగంగా దాదాపు 100 మందికి 2 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. గోళ్ళ రాజేష్ వ్యాపార రీత్యా అందుబాటులో లేనప్పటికీ తాను నమ్మే సిద్ధాంతం ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న ఉద్దేశంతో, భారతరత్న నోబుల్ శాంతి గ్రహీత మదర్ థెరీసా స్ఫూర్తితో నంద్యాలలో ఎన్నో సేవా కార్యక్రమాలు అందిస్తూ నేడు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ప్రతి నెల మందులు కొనుగోలుకు ఆర్థిక సహాయంగా ప్రతి ఒక్కరికి 2,000 రూపాయల ఆర్థిక సాయం చేసి దాదాపు 2 లక్షల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు, ఏపీయుడబ్లుజె జిల్లా కార్యదర్శి ఉస్మాన్ భాష, కార్యక్రమ సమన్వయకర్త, సీనియర్ జర్నలిస్ట్ నూర్ భాషా తదితరులు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో ఆదరణ కోల్పోయి, సంపాదించేందుకు వీలులేని పేదల ప్రజలకు ఇటువంటి తోడ్పాటు ఎంతో చేయూతనిస్తుందని, ఇటువంటి మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న గోళ్ళ రాజేష్ అభినందనీయుడని, అలాగే ఈ కార్యక్రమాన్ని నంద్యాలలో ఇంత పెద్ద స్థాయిలో నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వంతో పాటు ఇటువంటి దాతల చేయూత ఎంతో ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు. సంపాదించిన దాంట్లో కొంతమేర ఆర్థిక సహాయం చేయడం అనేది చాలా గొప్ప విషయమని, గత కొన్ని సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేస్తున్న గోళ్ళ రాజేష్ పలువురికి ఆదర్శప్రాయుడని కొనియాడారు.



# నంద్యాల మండలం కానాల గ్రామంలో వెలగని వీధిలైట్లు

## -ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని గ్రామ సర్పంచ్..సెక్రటరీ



నంద్యాల ప్రతినిధి. జనవరి 30 . (నంది పత్రిక ):నంద్యాల మండలం కానాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత 20 రోజుల నుండి వీధి లైట్ వెలగడం లేదని గ్రామ సర్పంచి కి అలాగే గ్రామ సెక్రెటరీ కి ఎన్నిసార్లు విన్నవించుకున్న వాళ్లు పట్టించుకోవడం లేదని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఇ. చెన్నయ్య అన్నారు.దాదాపుగా 20 రోజులు అవుతా ఉంది తమరి చెప్పబట్టి తమరు ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తే మాకు ఎలక్ట్రిషన్ పలకడం లేదు మేము ఏమి చేయాలి మీ ఇష్టం వచ్చినేది చేసుకోండని గ్రామ సెక్రెటరీ అంటున్నారు కాబట్టి పై అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో వీధిలైట్స్ వేయవలసిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా కోరుతున్నాము అలాగే ఎస్సీ కాలనీకి చెత్త సేకరించేవారు దాదాపుగా వారం రోజులు అవుతుంది రావడం లేదు అలాగే ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక సిమెంట్ రోడ్లపై నీళ్లు చేరి మురికి కుంటలను తలపిస్తున్నాయి.నిల్వ ఉన్న నీటిపై దోమలు చేరి అవి ప్రజలను కుట్టడంతో టైఫాయిడ్ మలేరియా చికెన్ గున్యా వంటి తదితర ప్రాణాంతక మైన రోగాలు వచ్చి ప్రజలు అంటు రోగాల బారిన పడుతున్నారు.గ్రామంలో దోమలు అధికంగా ఉన్నాయి కావున బ్లీచింగ్ పౌడర్ ఫాకింగ్ చేసి ప్రజలను అంటురోగాల భారీ నుండి కాపాడాలని కోరారు.

# ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీధర్ బాబు

టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఎడ్ సెట్ లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టి-సాట్ కంటెంట్ సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ద్వార అందుబాటులో ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఫిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. .బయాలజీ, ఫిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు స్జబెక్టులతో 98 రోజుల పాటు టి-సాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్ లో ప్రసారాలు కొనసాగుతాయి. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com